# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం | 30 ఆగస్టు, 2026 | పేజీలు : 08


## కొట్నాక భీంరావు ఆశయాలు కొనసాగించాలి: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్:** ఆదివాసీల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన దివంగత మాజీ మంత్రి కొట్నాక భీంరావు ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్స్ పార్కులో కొట్నాక భీంరావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ సాంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు, సంక్షేమం కోసం భీంరావు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, అదనపు కలెక్టర్ డేవిడ్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగా, పురపాలక సంఘం చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్, ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, కౌన్సిలర్లు చిలువేరు వెంకన్న, సలాం, కార్తీక్, ఆదివాసీ సంఘం నాయకులు అర్జు మాస్టర్, మడవి శ్రీనివాస్, బుర్సా పోచయ్య, భీంరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా
# తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు



### అంబేద్కర్ సంఘ భవనాలు పూర్తి చేస్తాం
### అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి అడ్లూరి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందని ఎస్‌సి,ఎస్‌టి,వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని దట్నూర్ గ్రామంలో ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన శనివారం ఆవిష్కరించారు.అనంతరం అంబేద్కర్ విగ్రహానికి నాయకులతో కలిసి పూల మాలవేసి మంత్రి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచే రాజ్యాంగాన్ని రూపొందించి ప్రతి భారతీయుడికి సమానత్వం,సామాజిక న్యాయం,విద్య ద్వారా సాధికారత కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు.జిల్లాలో మిగిలిపోయిన అంబేద్కర్ సంఘ భవనాలు పూర్తి చేస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా సమాజంలోని అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని , ప్రపంచం కొనియాడిన మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని మంత్రి అన్నారు.రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరు గౌరవించి అంబేద్కర్ ఆశయాలను నిత్య జీవితంలో ఆచరణలో పెట్టినప్పుడే సమానత్వ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు . కాంగ్రెస్ పార్టీ ద్వారానే పేద ప్రజల సంక్షేమం జరిగిందని మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆలోచనతో దేశంలో ఇందిరమ్మ వాడలు లేని గ్రామాలు లేవని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని గత ప్రభుత్వం సంక్షేమ శాఖకు బాకీ ఉన్న రూ. 100 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు . రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలతో సంక్షేమ హాస్టళ్లలో 10వ తరగతి విద్యార్థులు 99 శాతం ఉత్తీర్ణత సాధించారని మంత్రి వివరించారు. ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా యువతకు ఉన్నత విద్య చదువుకోవడానికి విదేశాల్లో ఉద్యోగ అవకాశాల కోసం శిక్షణ ఇస్తామని ,నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం ద్వారా నాణ్యమైన విద్యను అందించడానికి ధర్మపురి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని ధర్మపురిలో డిగ్రీ కళాశాల మంజూరు చేయించామని మంత్రి వివరించారు. అవకాశాలను సద్వినియోగం చేసుకొని యువకులు రాణించాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ధర్మపురి నియోజకవర్గంలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి,తెలిపారు.గ్రామంలోని బ్రిడ్జి పనులు త్వరలోనే ప్రారంభిస్తామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెక్కం గంగారాం,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాపల్లి గంగన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ బీమా సంతోష్, ,వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి ,జిల్లా మాజీ గంథ్రాలయ సంస్థ చైర్మన్ కటారి చంద్రశేఖర్ రావు,అంబేద్కర్ సంఘ జిల్లా అధ్యక్షులు కాంపల్లి హన్మాండ్లు,సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షులు దాసరి తిరుపతిగౌడ్,మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు,అంబేద్కర్ సంఘం నాయకులు,మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

## 6, 7, 8, వ తేదీలలో ఎఐటియుసి రాష్ట్ర మహాసభ




**ప్రజాపక్షం/ కోరుట్ల :** ఎఐటియుసి జగిత్యాల జిల్లా అనుబంధ కార్మిక స ంఘాల సమావేశం సి.ప్రభాకర్ భవన్ కోరుట్లలో అధ్యక్షులు ఏషవేణి గణేష్ అధ్యక్షత న శనివారం రోజున జరిగింది.ఈ సమావేశమునకు ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ వ ర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడుమారగోని ప్రవీణ్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. ఈ దేశంలోఎఐటియుసి మొట్టమొదటి సంఘ ము గా ఏర్పడి అనేక కార్మిక సంఘాలు ఏర్పాటు చేసి కార్మికుల హక్కుల కోసం సంక్షేమం కోసం చట్టాలను తెస్తూ పోరాడిన ఏకైక సం ఘంఎఐటియుసిఅని అన్నారు.ఈ సంఘం తెలంగాణ రాష్ట్ర ఎఐటి యుసినాలుగవ మహాసభలు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో వచ్చేనెల 6, 7, 8, వ తేదీలలో జరుగుతున్నందున మొదటి ఆరో తా రీఖున జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కార్మిక సం ఘాల నేతలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం,ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు సుతారి రాములు,జగిత్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏ.గణేష్ ఎండి ముక్రం,వర్కింగ్ ప్రెసిడెంట్ వెన్న మహేష్, ఉపాధ్యక్షులు కొక్కుల శాంత,కూన సరస్వతి,జిల్లా కోశాధికారి మేకల సాయి ఈశ్వరి, మహమ్మద్ ఉస్మాన్,రామిల్ల రాంబాబు,కిరణ్,శ్రీ గాద దేవదాస్ ఎన్నం రాధా,సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పిడుగురాళ్ల భూమేశ్వర్,మల్లాపూర్ రాజన్న,ఎం. డి. అలీ,తదితరులు పాల్గొన్నారు.

## భీమేశ్వర స్వామి ఆలయంలో
# మంత్రి , విప్ ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/వేములవాడ:** శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానంలో రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ తో కలిసి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ కు, విప్ ఆది శ్రీనివాస్ కు అర్చకులు, వేద పండితులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారికి శాస్రోక్తంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం వేద పండితులు వారికి వేదాశీర్వచనం చేయగా, ఆలయ డిప్యూటీ ఇఒ ప్రతాప నవీన్ కుమార్ స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ.. కొత్తకొండ వీరభద్ర స్వామి వారి నక్షత్రమాల ధరించిన అనంతరం వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో సుభిక్షంగా వర్ధిల్లాలని, ఎలాంటి కరువు కాటకాలు లేకుండా ప్రజలంతా పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని మనస్ఫూర్తిగా ప్రార్థించాను అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, పిఆర్ఓ పెరిక శ్రీనివాస్, ఆలయ ఉద్యోగులు, అర్చక బృందం, వేద పండితులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి క్షేత్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

### మంత్రి అడ్లూరి



## సెన్సస్ హ్యాండ్ బుక్ సమాచారం
# ఆన్‌లైన్ ప్రక్రియ వెంటనే పూర్తి

### కలెక్టర్ భవేశ్ మిశ్రా




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** సెన్స స్ హ్యాండ్ బుక్ మ్యానువల్ సమాచారం మొత్తాన్ని ఆన్ లైన్ చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం నిజామాబాదు నుంచి జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులతో సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పనపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మండలాలు,మున్సిపాలిటీల వారిగా ఇప్పటివరకు సేకరించిన నిర్దేశిత సమాచారం,ఇంకా సేకరించాల్సిన వివరాలు అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. సేకరించిన సమాచారాన్ని మొత్తం నిర్దేశిత ప్రొఫార్మాలో ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. సేకరించే, ఆన్ లైన్ చేసే సమాచా రం మొత్తం తప్పులు లేకుండా ఉండాలన్నా రు. వివిధ శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని తెలిపారు.ఈ వీసీలో జిల్లా కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్,సిపిఓ గంగారెడ్డి,ఇతర అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 7 నుండి మండల స్థాయి క్రీడలు

**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో సెప్టెంబర్ 7 నుంచి 9 వరకు స్కూల్ గేమ్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి బండారి మధు శనివారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 7న బాలికలకు, 8న బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, 9న అండర్–17 బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని పేర్కొన్నారు.అండర్–14కు 01012013 తర్వాత, అండర్–17 కు 01012010 తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు.జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో పాటు ప్రధానోపాధ్యాయుల సంతకం తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పిడీలు అనిత, రాజు,పిఇటి లురవి, అనూష,ముత్యం గౌడ్ పాల్గొన్నారు.

## విశ్వశాంతిలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం /రాయికల్ :** ప్రముఖ కవి, తెలుగు భాషాభిమాని గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకొని రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి హైస్కూల్లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ మచ్చ గంగాధర్ మాట్లాడుతూ తెలుగు భాష మన సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు.మాతృభాషపై ప్రతి ఒక్కరూ గౌరవాభిమానాలు పెంపొందించుకోవాలని సూచించారు.మాతృభాషను ప్రేమించి,నిత్య జీవితంలో తెలుగు వినియోగాన్ని పెంచాలని ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మచ్చ లలిత,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగార్జున జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం / జమ్మికుంట :** ప్రముఖ టాలీవుడ్ నటుడు కింగ్ అక్కినేని నాగార్జున జన్మదిన వేడుకలను శనివారం జమ్మికుంట పట్టణంలో అన్నపూర్ణ టాకీస్‌లో డాన్ రమేశ్ ఆధ్వర్యంలో అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 8వ వార్డు కౌన్సిలర్ కొలుగూరి సురేశ్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం రమేశ్ మాట్లాడుతూ అక్కినేని నాగేశ్వర్ రావు కుమారుడైన కింగ్ నాగార్జున విక్రమ్ సినిమాతో టాలీవుడ్ చిత్ర పరిశ్రమకు పరిచమయ్యారని అన్నారు. ప్రేక్షకులకు, అభిమానులకు మంచి మంచి చిత్రాలు అందించి అలరించారని ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అక్కినేని ఫ్యాన్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు రాజేశ్, చందు, శ్రీనివాస్, శ్రీకాంత్, వడ్లూరు సంపత్, వడ్లూరి శశి కుమార్, గుల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం సహాయనిధి పేదల పాలిట వరం

### జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**ప్రజాపక్షం / సారంగాపూర్ :** సియం సహాయనిధి పేదల పాలిట వరంగా మారిందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. సారంగాపూర్ మండలానికి చెందిన 23 మంది లబ్ధిదారులకు సియం సహాయనిధి ద్వారా మంజూరైన 9లక్షల 28వేల రూపాయల విలువ గల చెక్కులను రైతు వేదికలో ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యా వైద్యానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ చికిత్సలు 10లక్షలకు పెంచడం జరిగిందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుతో పారదర్శక సేవలు అందుబాటులోకి రానున్నాయని అన్నారు. స్మార్ట్ క్యూర్ కోడ్‌లో కుటుంబ సభ్యుల అన్ని వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఓటు జాబితాలో ప్రజలు వారి ఓటు లేనిచో సంబంధిత ధృవ పత్రాన్ని బిఎల్‌వోలకు అందజేయాలని అన్నారు.ప్రజాప్రతినిధులు అధికారులు బాధ్యత తీసుకుని ఓటరు మ్యాపింగ్ చొరవ చూపాలని అన్నారు. ఎమ్మార్వో వహీద్, ఎంపిడివో నీరజ, పాక్స్ చైర్మన్లు నరసింహ రెడ్డి, మల్లారెడ్డి, స్థానిక సర్పంచ్ అరుణ శేఖర్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు సొల్లు సురేందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మనోహర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాజేందర్ రెడ్డి, మాజీ ఎంపిపి కోల శ్రీనివాస్, సర్పంచులు కొలపాక రాధ రాజు, బాస మహేష్, రుషేంద్ర శంకర్ రెడ్డి, అశ్విని రమేష్, మ్యాకల శేఖర్, వార్డు మెంబర్ ఫోరం నాంపల్లి, అధికారులు, పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 'రామగుండం కమిషనరేట్ ' టాప్!

### పోలీసులకు డి.జి.పి. అభినందనలు!!



**ప్రజాపక్షం/గోదావరిఖని :** రాష్ట్రస్థాయిలో క్రైమ్ పారామీటర్ల అమలులో రామగుండం పోలీస్ కమిషనరేట్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రంలోనే ఉత్తమ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని వివిధ పోలీస్ యూనిట్ల పనితీరును సమీక్షించిన ఉన్నతాధికారులు, అత్యుత్తమ పనితీరు కనబరిచిన యూనిట్లను గుర్తించారు. ఇందులో క్లస్టర్1లో హైదరాబాద్, క్లస్టర్2లో రామగుండం, క్లస్టర్3లో నల్గొండ, క్లస్టర్ 4లో సూర్యాపేట పోలీస్ యూనిట్‌లు మొదటి స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా శనివారం ఉత్తమ ప్రతిభ కనబరచడం పట్ల రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్‌లకు రాష్ట్ర డీజీపీ సీవీ.ఆనంద్ ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడ మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించి, ఉత్తమ ఫలితాలు సాధించాలని డీజీపీ సూచించారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణ, కేసుల పరిష్కారం, శాంతి భద్రతల పరిరక్షణలో చూపిన ప్రతిభకు ఈ పురస్కారం దక్కడం పట్ల పోలీసు సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కాంగ్రెస్ 1000 రోజుల వైఫల్యాలపై బిఆర్ఎస్ పోరుబాట

### చల్మెడ లక్ష్మి నరసింహారావు పిలుపు



**ప్రజా పక్షం/ వేములవాడ టౌన్:** వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులతో ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మి నరసింహారావు పట్టణంలోని ఆయన నివాసంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల వైఫల్యాలపై పోరుబాటకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 2 నుండి వారం రోజుల పాటు కాంగ్రెస్ మోసపూరిత వైఖరిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఇచ్చిన 420 హామీల మోసంతో పాటు పాలనా వైఫల్యాలను వినూత్న రీతిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. వెయ్యి రోజులైనా నెరవేరని హామీలపై ప్రజలను చైతన్యవంతం చేయడమే కాకుండా, కాంగ్రెస్ వైఫల్యాలు, అవినీతిని ఎండగట్టాలని మండలాల పార్టీ నాయకులను కోరారు.

# వెల్దుర్తి గ్రామంలో వొర్రె స్థలంపై కబ్జా యత్నం

**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్:** జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామంలోని సర్వే నంబర్ 93లో వొర్రె (నీటి కాలువ)తో పాటు గ్రామస్తుల రాకపోకలకు వినియోగంలో ఉన్న దారి స్థలాన్ని సాదా బైనామా ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పలువురు రైతులు ఆరోపించారు.ఈ వ్యవహారంపై పోలీసు,రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించి తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు కోరారు.జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం రైతులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గడ్డం ఆనందరావుకు సర్వే నంబర్ 93లో 6 ఎకరాల 08 గుంటల భూమి ఉండేదని తెలిపారు. సుమారు 25 ఏళ్ల క్రితం చల్ల హనుమండ్లు,పశుల గంగన్న, పశుల దేవయ్య, బిరుదుల లింగయ్య తదితరులకు ఆ భూమిని విక్రయించినట్లు పేర్కొన్నారు.కొనుగోలుదారుల రాకపోకల కోసం వదిలిన దారితో పాటు పూర్వకాలం నుంచి గ్రామ ప్రజలు వినియోగిస్తున్న వొర్రె స్థలం కలిపి సుమారు 30 గుంటల వరకు ఉంటుందని రైతులు తెలిపారు. ఈ స్థలాన్ని గతంలో ఎవరి పేరునా పట్టా చేయకుండా గ్రామ ప్రజలందరికీ ఉపయోగపడేలా ఉంచారని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఆనంద రావు వారసురాలు బెజ్జంకి నిహారిక సదరు దారి, వొర్రె స్థలాన్ని సాదా బైనామా ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని తమ స్థలంగా చూపిస్తూ కబ్జాకు ప్రయత్నిస్తున్నారని రైతులు ఆరోపించారు. వొర్రెకు సంబంధించిన స్థలం సర్వే నంబర్లు 211, 91, 92 పరిధిలో ఉన్నప్పటికీ,తమ భూమిలోనే వొర్రె ఉందంటూ రెవెన్యూ అధికారులను తీసుకువచ్చి కొత్తగా దారి చూపించే ప్రయత్నం చేశారని వారు తెలిపారు. సంబంధిత రెవెన్యూ రికార్డులు, పాత రికార్డులు, సర్వే వివరాలను సమగ్రంగా పరిశీలించి వొర్రె, దారి స్థలాలకు సంబంధించిన వాస్తవాలను నిర్ధారించాలని రైతులు అధికారులను కోరారు. తమ భూమికి న్యాయపరమైన రక్షణ కల్పించి, సమస్యను పరిష్కరించి తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గ్రామస్తులు ములాసపు లింగయ్య,ములాసపు రాజం,ములాసపు మల్లేశం,తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పంటల నమోదు, పిఎం కిసాన్ ఇ-కెవైసిపై అవగాహన

**ప్రజాపక్షం/ముత్తారం :** లక్కారం గ్రామంలో శనివారం ఉదయం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పలు ముఖ్యమైన అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డిజిటల్ క్రాప్ సర్వే,పీఎం కిసాన్ ఫేషియల్ ఈకేవైసీ, సన్న వరి సాగు వివరాల నమోదు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రైతులు సాగు చేసిన పంట, పంట రకం,నీటిపారుదల సౌకర్యం తదితర వివరాలను సర్వే నంబర్ వారీగా డిజిటల్ క్రాప్ సర్వేలో సక్రమంగా నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట రకాలను సక్రమంగా నమోదు చేసుకోవడం వల్ల పంట విక్రయ సమయంలో ప్రభుత్వ ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.అలాగే పీఎం కిసాన్ పథకం కింద రూ.2,000 పొందుతున్న రైతులకు ఫేషియల్ ఈకేవైసీ నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులు తమ ఆధార్ వివరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో లక్కారం గ్రామ సర్పంచ్ అత్తె చంద్రమౌళి,వ్యవసాయ విస్తరణ అధికారి బి. శశిధర్,గ్రామ వాలంటీర్ గనవేన కుమార్,గ్రామ రైతులు రాజయ్య, సతీష్,నారాయణ, సారయ్య,నరసయ్య, మోహన్ రెడ్డి,శంకర్, లింగయ్య, మొండిచెయ్యి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ క్రీడా దినోత్సవం

**ప్రజాపక్షం /రాయికల్ :** జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాష దినోత్సవాన్ని శనివారం ప్రభుత్వ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులను,తెలుగు పండితులను శాలువ మెమొంటోతో ఘనంగా సన్మానించారు.అనంతరం రాయికల్ బాయ్స్ హై స్కూల్ లో బాస్కెట్ బాల్ స్టేట్ పూర్వ క్రీడాకారుల సహకారంతో 15 వేల రూపాయలతో బాస్కెట్ బాల్ కోర్టు లో రింగ్స్,కలర్లు, బాస్కెట్ బాల్ ను అందించి కోర్టును ప్రారంభించారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వాసం ప్రసాద్ మాట్లాడుతూవిద్యతో పాటు క్రీడా రంగాల్లో విద్యార్థులు, యువత రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్,కోశాధికారి సుధవేణి మురళి,క్లబ్ సభ్యులు బత్తిని భూమయ్య,మ్యాకల రమేష్, మచ్చశేఖర్,దాసరి గంగాధర్,కుర్మ సుదర్శన్ రెడ్డి,ఆడెపు రాంప్రసాద్,బాలే నిఖిల్, సాంబారు శ్రీనివాస్,పులి రమేష్,సామల్ల సత్యనారాయణ, వ్యాయామ,తెలుగు పండిత ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** రాఖీ పండుగ సందర్భంగా బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన జగిత్యాల మండలం తక్కళ్లపల్లి చోటుచేసుకుంది.ధర్మపురి మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన కుదురుపాక అశోక్ (40), తండ్రి నారాయణ, కుటుంబ సభ్యులతో కలిసి రాఖీ పండుగ సందర్భంగా బంధువుల ఇంటికి వెళ్లాడు. అనంతరం శుక్రవారం రాత్రి బైక్‌పై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైన క్రమంలో రాత్రి సుమారు 10 గంటల సమయంలో తక్కళ్లపల్లి గ్రామ సమీపంలోని క్వార్రీ వద్దకు చేరుకోగానే, సోమనపల్లి గ్రామానికి చెందిన మామిడిపల్లి రమేష్ నడుపుతున్న బైక్ అశోక్ ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో అశోక్‌కు చేతులు, కాళ్లు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలిస్తుండగా,శనివారం తెల్లవారుజామున సుమారు 4:30 గంటలకు మృతి చెందాడు.మృతుడి భార్య రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## వైద్య చికిత్సకు రూ.1.50 లక్షల ఎల్ఓసి అందజేత

**ప్రజాపక్షం/ముత్తారం :** అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు వైద్య సహాయం అందించడంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఎల్లప్పుడూ ముందుంటారని మరోసారి నిరూపితమైంది.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రానికి చెందిన పెయ్యాల రాధమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఆర్థిక ఇబ్బందుల వల్ల వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితిలో ఉన్న రాధమ్మ కుటుంబ సభ్యులు మంత్రి శ్రీధర్ బాబును ఆశ్రయించారు.వారి పరిస్థితిపై తక్షణమే స్పందించిన మంత్రి,ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 1,50,000/ ఎల్‌ఓసీని మంజూరు చేయించారు.హైదరాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఆసుపత్రి సహాయకులు ఈ ఎల్‌ఓసీ పత్రాన్ని బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.విపత్కర పరిస్థితుల్లో తక్షణమే స్పందించి,భారీ ఆర్థిక సహాయం అందించి తమకు కొండంత భరోసానిచ్చిన మంత్రి శ్రీధర్ బాబుకు రాధమ్మ కుటుంబ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం కాలుష్యాన్ని నియంత్రించేందుకు దోహదం



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 13 వార్డులో ఏడీఎంఎస్ మోటార్ ఎలక్ట్రిక్ వెహికల్ నూతన షో రూమ్ ను నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ జిందం కళ చక్రపాణిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వ ల్ల కాలుష్యాన్ని నియంత్రించేందుకు దోహదపడుతుందని అన్నారు. ఈ ప్రారంభోత్సవంలో బిఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తో ట ఆగయ్య, మాజీ జెడ్ పి చైర్మన్ తుల ఉమ,13 వార్డు కౌన్సిలర్ బర్ల నారాయణ,కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షులు సూర దేవరాజ్, సినీ నటుడు శివం పాల్గొన్నారు.

## ఘనంగా క్రీడా పోటీలు

ప్రజాపక్షం /ముస్తాబాద్: హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జెడ్పీహెచ్ఎస్ బంధనకల్ పాఠశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పరశురాములు ఆధ్వర్యంలో శనివారం వివిధ క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ చిగురు నరేష్ పాల్గొని. విద్యార్థులకు వివిధ క్రీడాంశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులను అందజేశారు. క్రీడా పోటీల నిర్వహణకు ప్రోత్సాహంగా యువజన సభ్యులు ఎనగందుల నరసింహులు, ఎనగందుల నరేష్, మోట్ల వెంకటేష్ కు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకట గోపాల చారి, సత్యనారాయణ రావు, శారద దేవి, రాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిఆర్‌టియుటిఎస్ మండల శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం పి ఆర్ టి యు టి ఎస్ మండల శాఖ సర్వసభ్య సమావేశము శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం ఎన్నికల పరిశీలకులు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బొమ్మన చిన్నయ్య, జిల్లా అసోసియేట్ కార్యదర్శి శ్రీధర్ కుమార్, కోరుట్ల మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వాజిద్, శేఖర్ ఆధ్వర్యంలో మండల పిఆర్టియు టీఎస్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జంగిలి అశోక్,ప్రధాన కార్యదర్శిగా ఉలిసే వెంకటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా తిరుపతి నాయక్, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా ఎం.కవిత ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా పవన్ కళ్యాణ్, కొత్తూరి రాజ్ కుమార్,మహిళా ఉపాధ్యక్షులుగా యాస్మిన్,గంగామణి, కార్య దర్శులుగా విశాల్, రంజిత్, మహిళా కార్య దర్శులుగా గిరిజ, రాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# ఎస్ఎస్‌సి టాపర్స్‌కు ప్రతిభా పురస్కారాలు

ప్రజాపక్షం / జమ్మికుంట : మున్సిపాలిటీ పరిధిలోని ఆబాది జమ్మికుంట జిల్లా పరిషత్ సెంకడరీ పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థులు పింగళి వెంకట రెడ్డి మార్క విజయ్ ప్రకాష్, డా.కాటిపల్లి లింగారెడ్డి, అయిత శ్రీనివాస్, అమృత సురేష్ పూర్వ విద్యార్థులు 2015 సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం ఈ పాఠశాలలో 10 వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి నగదు పురస్కారం సర్టిఫికెట్ ప్రధానం చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్ష 2026లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు నగదు పురస్కారాలతో పాటు సర్టిఫికెట్ ప్రధానం చేశారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు పద్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన దొంకటి సాక్షిత, దొడ్డె రణవర్దన్, మైస అక్షిత్‌లకు రూ.5 వేలు, రూ.3వేలు, రూ.2 వేల చొప్పున నగదు పురస్కారంతోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి అయిత శ్రీనివాస్ విద్యార్థిని వి ద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. విద్యార్థులకు భవిష్యత్ విద్యావసరాలు తీర్చడానికి తమ సహకా రం అందిస్తామని మరోక పూర్వ విద్యార్థి డా.లింగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు రాజేంద్ర కుమార్, కృష్ణమూర్తి, సృ జన, రాజశ్రీ, దుర్గాప్రసాద్, స్థానిక కౌన్సిలర్ సుజాత వి ద్యార్థుల తల్లిదండ్రులు కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# కోర్టులో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

### తోటి న్యాయవాదులకు రాఖీలు కట్టిన మహిళా న్యాయవాదులు

ప్రజా పక్షం/ వేములవాడ టౌన్: వేములవాడ కోర్టు బార్ అసోసియేషన్ హాల్లో రాఖీ పౌర్ణమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా న్యాయవాదులు తోటి న్యాయవాదులకు రాఖీలు కట్టి, పరస్పరం శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్ మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి సోదరభావం, ఆత్మీయత, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పరస్పర స్నేహభావాన్ని, సోదరభావాన్ని మరింత పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి తమిరి అన్నపూర్ణ, లైబ్రరీ సెక్రెటరీ మొగిలి సుజాత, బూర సరిత, పావని, సబ్‌కోర్టు ఏపీపీ అవధూత రజినీకాంత్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గొంటి శంకర్, మాజీ అధ్యక్షులు గుడిసె సదానందం, మాజీ జనరల్ సెక్రెటరీ గడ్డం సత్యనారాయణ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ కనికరపు శ్రీనివాస్, పొత్తూరు అనిల్ కుమార్ తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# విద్యుత్ సిబ్బందికి.. కేబుల్, ఇంటర్నెట్ తీగలతో ఇబ్బంది

### కోరుట్లలో అస్తవ్యస్తంగా వేలాడుతున్న వైర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి

ప్రజాపక్షం /కోరుట్ల : కోరుట్ల పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లు, ఇంటర్నెట్ వైర్లు, ఇతర కమ్యూనికేషన్ కేబుళ్లు అస్తవ్యస్తంగా పేరుకుపోయి కనిపిస్తున్నాయి.విద్యుత్ స్తంభాల చుట్టూ పెద్ద సంఖ్యలో వైర్లను చుట్టి ఉంచడంతో పాటు,వినియోగంలో లేని వైర్లు కూడా తొలగించకుండా అలాగే వదిలేయడం వల్ల పట్టణ ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.తాజాగా తీసిన చిత్రాల్లో విద్యుత్ స్తంభాలపై పెద్ద సంఖ్యలో వైర్లు ఒకదానికొకటి చిక్కుకుని వేలాడుతున్న దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.కొన్ని చోట్ల అదనపు కేబుళ్లను స్తంభాల చుట్టూ వలయాలుగా చుట్టి ఉంచగా, మరికొన్ని చోట్ల వైర్లు రోడ్డు వైపునకు వేలాడుతున్నట్లు కనిపిస్తోంది.దీంతో విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేపట్టే సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు.పట్టణంలోని విద్యుత్ స్తంభాలపై విద్యుత్ సరఫరా తీగలతో పాటు పలు ప్రైవేట్ టెలికాం, కేబుల్ సంస్థలకు చెందిన కమ్యూనికేషన్ వైర్లు ఏర్పాటు చేయడం వల్ల పరిస్థితి మరింత గందరగోళంగా మారిందని ప్రజలు పేర్కొంటున్నారు.వినియోగంలో లేని, తెగిపోయిన లేదా అదనంగా ఉన్న కేబుళ్లను గుర్తించి తొలగించడంతో పాటు, అవసరమైన వైర్లను క్రమబద్ధీకరించాలని వారు కోరుతున్నారు.కోరుట్ల మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగం పరిధిలో వీధి దీపాల మరమ్మతులు,నిర్వహణ వంటి పనులు ఉన్నాయి. అలాగే కోరుట్ల విద్యుత్ విభాగానికి సంబంధించిన టిఎస్ఎన్పిడిసిఎల్ అధికారులు విద్యుత్ సరఫరా, విద్యుత్ మౌలిక వసతుల నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. కోరుట్ల పట్టణంలోని విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుళ్లను సమగ్రంగా పరిశీలించి, సంబంధిత సంస్థలతో సమన్వయం చేసి అనవసరమైన వైర్లను తొలగించి, మిగిలిన వాటిని క్రమబద్ధీకరించాలని ప్రజలు కోరుతున్నారు. దీంతో విద్యుత్ సిబ్బందికి మరమ్మతుల సమయంలో ఇబ్బందులు తగ్గడంతో పాటు రహదారులపై ప్రజలకు కూడా మరింత భద్రత కలుగుతుందని పలువురు సామాజిక కార్యకర్తలు.అభిప్రాయపడుతున్నారు.

# సింగరేణిని దోచేందుకే 'రివ్యూ' నాటకాలు!

### మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

ప్రజాపక్షం/గోదావరిఖని : రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుల దోపిడి, అక్రమాలు శృతిమించాయని, సింగరేణి ఆస్తులను కట్టబెట్టుకోవడంతోపాటు కార్మికులు, చిరు వ్యాపారుల పొట్టకొట్టే కుట్రలు చేస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ధ్వజమెత్తారు. శనివారం రామగుండంలోని బిఆర్ఎస్ పార్టీ, టిబిజికెఎస్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన అత్యవసర విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) సూర్యనారాయణ, జీఎంలతో కలిసి సింగరేణి వ్యాప్త రివ్యూ నిర్వహించడంపై చందర్ తీవ్రస్థాయిలో ఆక్షేపించారు. అసలు సింగరేణి వ్యాప్తంగా సమీక్ష నిర్వహించడానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు ఉన్న అధికారం ఏమిటి? ఆయనకు ఆ అధికారం సీఎండీ ఇచ్చారా? సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చారా? లేక డిప్యూటీ సీఎం ఇచ్చారా? అని ప్రశ్నించారు. సింగరేణి అధికారులను ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుకు పిలిపించుకుని కార్మికుల్లో సందేహాలు, భయాందోళనలు రేకెత్తిస్తున్నారని మండిపడ్డారు. స్థానిక ఓల్డ్ అశోక్ నగర్ భూములను అప్పగించడానికి, ప్రైవేట్ నిర్మాణాల పేరుతో కాంగ్రెస్ నాయకులు అక్రమాలకు పాల్పడటానికి, స్థలాలను నచ్చినట్టు అమ్ముకోవడానికి అవకాశాలు ఇచ్చేందుకే డైరెక్టర్ ఆపరేషన్స్‌తో కలిసి ఈ సమీక్షలు జరుపుతున్నారని చందర్ ఆరోపించారు. సింగరేణి స్థలాల్లో నిర్మాణాలు జరిగితే సింగరేణి యాజమాన్యం బోర్డులు ఉండాలి కానీ, కాంగ్రెస్ నాయకుల ఫోటోలు పెట్టుకోవడం ఏమిటని నిలదీశారు. బిఆర్ఎస్ హయాంలో కెటిఆర్, హరీష్‌రావుల మార్గదర్శకత్వంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో సింగరేణి నిధులు రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీ(సిమ్స్‌సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) సాధించడమే కాకుండా, అందులో 5 శాతం సీట్లు సింగరేణి కార్మికుల పిల్లలకే దక్కేలా చేశామని గుర్తుచేశారు.ఈ సమావేశంలో నాయకులు మిర్యాల రాజిరెడ్డి, కౌశిక హరి, నూనె కొమురయ్య, మురళీధర్‌రావు, వ్యాల్ల హరీష్‌రెడ్డి, మాదరి రామమూర్తి, సంతోష్‌లతోపాటు మాజీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, కార్మిక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రారంభంలోనే గ్రామస్తుల పడిగాపులు



ప్రజాపక్షం /మల్లాపూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులలో నెలకొన్న వివాదాలను తొలగించేందుకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి భూ సర్వే పనులు తూతు మంత్రంగానే కొనసాగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు శనివారం సంగం శ్రీరాంపూర్ గ్రామంలో ఉదయం 9 గంటలకు భూ సర్వే ప్రారంభిస్తున్నట్లు అధికారులు గ్రామస్తులకు తెలిపారు. దీంతో గ్రామస్తులు అధికారులు సమయానికి వస్తారనుకుని తొమ్మిది గంటల నుండి ప్రభుత్వ పాఠశాలలో అధికారుల కోసం పడిగాపులు కాశి వేచి చూసే పరిస్థితి ఎదురవడంతో అధికారులే సమయపాలన పాటించకపోతే ఎలా అని వేచి చూసిన గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు. అనంతరం రెండు గంటల తర్వాత, దాదాపు 11:30 గంటల ప్రాంతంలో భూరి సర్వేను గ్రామస్తులతో కలిసి అధికారులు ప్రారంభించారు. తమ గ్రామంలో నెలకొన్న వివాదాలను తూతూ మంత్రంగా సర్వే చేసి పరిష్కరించకుండా శాశ్వత పరిష్కారం చూపేలా రైతులకు న్యాయం జరిగేలా పకడ్బందీగా సర్వే నిర్వహించాలని గ్రామ ప్రజా ప్రతినిధులు,గ్రామస్తులు అధికారులను కోరారు.

## నానో ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం: జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గోదూర్ గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో శనివారంనానో ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆత్మ డి.పి.డి సుధాకర్ నానో ఎరువుల వినియోగం,వాటి ప్రయోజనాలు,పిచికారీ విధానంతో పాటు నేల ఆరోగ్య నిర్వహణలో సిఫారసు చేసిన ఎరువుల మోతాదులను పాటించడం, సమతుల్య ఎరువుల వినియోగం వంటి అంశాలపై రైతులకు వివరించారు.మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ రైతులకు ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ వినియోగం, యూరియా బుకింగ్ విధానం,సన్నరకాల వరి విత్తనాల ఆన్‌లైన్ నమోదు తో పాటు ఎల్‌నినో పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆత్మ చైర్మన్ వాకిటి భూమారెడ్డి, సర్పంచ్ బండి రాజేష్, ఉపసర్పంచ్ ఓంకార్ లక్ష్మణ్, ఏ ఈ వోలు సాగర్,వినోద్, రైతులు పాల్గొన్నారు.

## తెలుగు వెలుగులు.. మేడిపల్లి పాఠశాలలో వేడుకలు

ప్రజాపక్షం/మెట్‌పల్లి : మేడిపల్లి(పడమర) ప్రభుత్వ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పద్యాల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని,చక్కగా పద్యాలను ఆలపించి ఆకట్టుకున్నారు.అనంతరం విద్యార్థులు తెలుగు భాష గొప్పతనం, ప్రాధాన్యతపై ఉపన్యాసాలు అందించి సభను రంజింపజేశారు. తెలుగు పండితులు సొప్పరి శ్రీనివాస్ తెలుగు భాషా దినోత్సవం ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించడంతో పాటు పలు తెలుగు కవితలను ఆలపించి వినిపించారు.ప్రధానోపాధ్యాయురాలు సి.హెచ్. నాగమణి మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణ, అభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని సూచించారు. ఉపాధ్యాయులు శ్రీదేవి,పద్మలత,నాగన్న,జ్యోతి,భీమన్న, లక్ష్మి, ఉమా తదితరులు తెలుగు భాష గొప్పతనం,మాధుర్యం,ప్రత్యేకత గురించి వివరించారు.విద్యార్థుల పద్యగానం,ప్రసంగాలతో పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి.

## ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాపక్షం/గొల్లపల్లి : ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నసంఘటన జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని చందోలి గ్రామంలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని చందోలి గ్రామానికి చెందిన జూట పోచయ్య (55) గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ మధ్యన అతని మానసిక పరిస్థితి బాగోలేక తనలో తానే మాట్లాడుకుంటూ మానసిక ఒత్తిడికి గురై ఈనెల 29 శనివారం రోజున ఇంట్లో ఎవరు లేని సమయం లో దూలానికి చీర తో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు .కుటుంబ సభ్యులు చూసేసరికి మృతి చెంది ఉన్నాడు.మృతుడి కొడుకు జూట నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీల అందజేత



ప్రజాపక్షం/వీణవంకః కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని కోర్కల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రోసీడింగ్స్ కాపీలను అందజేశారు. కోర్కల్ గ్రామ సర్పంచ్ పూదరి రమ్యకృష్ణ చేతులమీదుగా ఈ కాపీలను అందజేసి అనంతరం ఆమె మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లను అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల కాపీలను అందుకున్న అయిదుగురు లబ్ధిదారులు సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న దేవాదాయ శాఖ కమిషనర్

ప్రజాపక్షం/మల్యాలః జగిత్యాల జిల్లా మల్యాల మండలం పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారిని దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు శనివారం దర్శించుకున్నారు .కొండగట్టు దేవస్థానానికి చేరుకున్న కమిషనర్‌కు ఆలయ అధికారులు,అర్చకులు సాదర స్వాగతం పలికారు.అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు శేష వస్త్రంతో కమిషనర్‌ను ఘనంగా సత్కరించి వేదాశీర్వచనాలు అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు,ప్రధాన అర్చకులు,ఆలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఆఫీసర్‌కి ఆత్మీయ సన్మానం

ప్రజాపక్షం/రామగిరి : రామగిరి మండలం (సీఎన్ సి ఓ ఏ)క్లబ్‌లో రామగుండం రీజియన్ సింగరేణి సివిల్ క్వాలిటీ కంట్రోల్ సెల్ అడిషనల్ జనరల్ మేనేజర్ పల్లెర్ల నాగేశ్వరరావు పదవీ విరమణ సందర్భంగా ఘనంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆర్జీ3 జనరల్ మేనేజర్ సుంకరి మధుసూదన్,మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్ సివిల్ కాంట్రాక్టర్లు పాల్గొని పల్లెర్ల నాగేశ్వరరావును శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు తదాంతరం మాట్లాడుతూ విధి నిర్వహణలో పల్లెర్ల. నాగేశ్వరరావు చూపిన నిబద్ధత, క్రమశిక్షణ,సంస్థకు అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు.ఉద్యోగ జీవితంలో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.పదవీ విరమణ అనంతరం ఆయన జీవితం ఆయురారోగ్యాలతో, ప్రశాంతంగా, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సివిల్ డీజీఎం రాజేంద్రకుమార్ సింగరేణి సివిల్ ఉద్యోగులు,తదితరులు పాల్గొన్నారు.

# మాలల హక్కుల కోసం ఛలో సెక్రటేరియట్

### జిఒ నం.99 రద్దు చేసి రోస్టర్ విధానాన్ని సవరించాలి



ప్రజాపక్షం/గన్నేరువరం : రాష్ట్రంలోని మాలల సమస్యల పరిష్కారం కోసం, హక్కుల సాధన కోసం హైదరాబాద్ లోని డా.బి.ఆర్.అంబేద్కర్ సచివాలయం వద్ద ఆగస్టు 31న ఛలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గన్నేరువరం మండల మాల మహానాడు అధ్యక్షులు అనుమండ్ల మల్లేశం, గౌరవ అధ్యక్షులు న్యాత సుధాకర్ తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మాలల హక్కులు, ఆత్మ గౌరవం, సామాజిక సమానత్వం కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా మాలలు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.
పిలుపునిచ్చారు. హక్కుల కోసం జరిగే ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఐక్య ఉద్యమంతోనే మాలల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తుమ్మ ప్రభాకర్, మండల ఉపాధ్యక్షులు కర్నే కొమురయ్య, న్యాత రాజేందర్‌తోపాటు పలువురు మాల కులస్థులు పాల్గొన్నారు. జై భీమ్ జై మాల అంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు



ప్రజాపక్షం/జమ్మికుంట : ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఇంఛార్జీ ప్రిన్సిపాల్ డా.కె.గణేశ్ అధ్యక్షతన తెలుగు విభాగాధిపతి డా.మురాడి శ్యామల ఆధ్వర్యంలో శనివారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంఛార్జీ ప్రిన్సిపల్ గిడుగు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొద్దిమంది వరకే పరిమితమైన చదువును అందరికీ అందుబాటులోకి తెచ్చిన వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు అని అన్నారు. భాషలెన్ని నేర్చుకున్నా భావోద్వేగాలను వ్యక్తం చేయడానికి మధురమైన తెలుగు భాషకు సాటేదీ లేదని అన్నారు. తెలుగు అధ్యాపకురాలు డా.మురాడి శ్యామల మాట్లాడుతూ తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకొచ్చి నిత్య వ్యవహారంలోని బాషలో ఉన్న మాధుర్యాన్ని తెలియజేసిన మహానీయులు గిడుగు అని అన్నారు. తెలుగు భాషా ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి విశ్వ విద్యాలయ స్థాయి వరకు తెలుగు మాధ్యమం అందుబాటులో రావాలని ప్రభుత్వం జారీ చేసే ఉత్తర్వులు, సమాచారం తెలుగులో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఉమాకిరణ్, డా.కె.మాధవి, డా.స్వప్న, డా.రాజకుమార్, డా.ఎంబాడి రవి, రవీందర్, డా.రవిప్రకాశ్, డా.శ్రీనివాస్, రమేశ్, సాయికుమార్, అరుణ్ కుమార్, అధ్యాపకేతర బృందం తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

### మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్



ప్రజాపక్షం/రాయికల్ : రాయికల్ మున్సిపాలిటీ పరిధిలో భవన నిర్మాణాలు చేపట్టే ప్రజలు తెలంగాణ మున్సిపాలిటీ యాక్ట్–2019లోని సెక్షన్ 114తో పాటు అమలులో ఉన్న బిల్డింగ్ రూల్స్ ప్రకారం తప్పనిసరిగా ముందస్తు భవన నిర్మాణ అనుమతి పొందాలని మున్సిపల్ కమీషనర్ మనోహర్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా భవన నిర్మాణ సమయంలో సంబంధిత బిల్డింగ్ రూల్స్ ప్రకారం అవసరమైన కనీస రహదారి వెడల్పు,సెట్ బ్యాక్స్ తదితర నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. సంబంధిత భవన కేటగిరీకి వర్తించే నిబంధనల ప్రకారం అవసరమైన రహదారి వెడల్పు కనీసం 9 మీటర్లు ఉండాలని పేర్కొన్నారు.

అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు : మున్సిపల్ అనుమతి లేకుండా ఎటువంటి భవన నిర్మాణాన్నీ చేపట్టరాదని అధికారులు స్పష్టం చేశారు. అనుమతి లేకుండా లేదా మంజూరైన అనుమతికి విరుద్ధంగా నిర్మాణం చేపట్టినట్లయితే తెలంగాణ మున్సిపాలిటీస్ యాక్ట్–2019లోని సెక్షన్ 174తో పాటు వర్తించే ఇతర నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అవసరమైతే అక్రమ నిర్మాణాలను నిలిపివేయడం,తొలగించడం లేదా కూల్చివేయడం వంటి చర్యలు కూడా చేపట్టనున్నట్లు తెలిపారు.

# ఎఫ్ఎల్ఎన్ లక్ష్య సాధనలో అందరం కలిసి పనిచేద్దాం



ప్రజాపక్షం/కరీంనగర్ః రాష్ట్రంలో ప్రస్తుతం మిషన్ ప్రాతిపదికన ఎఫ్ ఎల్ ఎన్ ప్రగతి కోసం పనిచేస్తుండడంతో అందులో జిల్లా అగ్రగామిగా రావడానికి కావలసిన తీరుగా సమిష్టిగా అందరం పనిచేద్దామని జిల్లా విద్యాధికారి చైతన్య జైనీ మండల విద్యాధికారులు మరియు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో పిలుపునిచ్చారు. రాష్ట్ర విద్యా శాఖ ఇటీవల బేస్ లైన్ టెస్ట్ ఫలితాల మీద ఇచ్చిన సమగ్ర రిపోర్టు మీద పూర్తిస్థాయి సమీక్ష జరిగింది. ఒక్కొక్క సబ్జెక్టులో ఒక్కొక్క సామర్థ్యంలో జిల్లా స్థాయిలో కాంపిటెంట్ మరియు నాన్ కాంపిటెంట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ప్రగతి మీద పరిశీలన జరిగి, దానికి తదనుగుణమైన విధంగా కార్యక్రమాలు నిర్వహించడంలో అధికారులు అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. కాంపిటెంట్ స్కూళ్ళలో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో త్వరలో ఒక ఓరియెంటేషన్ నిర్వహించి వారికి దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. వెనకబడి ఉన్న సామర్థ్యాల మీద అనుగుణమైన కార్యాచరణ ప్రణాళిక చేయాలని తెలిపారు. అలాగే ఏకరూప దుస్తులు, జిల్లా పరీక్షల నిర్వహణ, అపార్ మరియు స్పర్శ్ అంశాల మీద పూర్తిస్థాయిలో పనిచేయాలని, ఏవైనా ఇబ్బందులు ఉంటే జిల్లా విద్యాశాఖ దృష్టికి తేవాలని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం పూర్తి స్థాయి లక్ష్యం ఎఫ్ ఎల్ ఎన్ సాధన అని గుర్తెరిగి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, ప్రాథమిక స్థాయిలో నాణ్యమైన విద్య సాధించినప్పుడే విద్య ప్రగతిశీలంగా ఉంటుందని సూచించారు.ఈ కార్యక్రమంలో క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్ రెడ్డి, ఏ ఎమ్ ఓ శ్రీనివాస్, ప్లానింగ్ కో ఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్, డిసీఈబి సెక్రటరీ భగవంతయ్య , మండల విద్యాధికారులు మరియు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, అకాడమిక్ ప్యానెల్ ఇన్స్పెక్షన్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు

## రజితకు అండగా ఉంటాము

### ఎంఎల్ఎ డా.మేడిపల్లి సత్యం



ప్రజాపక్షం/గంగాధరః గంగాధర మండలం వెంకటాయపల్లి గ్రామానికి చెందిన ఇడగొట్టి వెంకటి హారిక దంపతుల మూడవ కుమార్తె ఇడగొట్టి రజిత పుట్టుకతోనే దివ్యాంగురాలు. వెంకటిహారిక దంపతులు గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. తల్లిదండ్రులు కష్టపడి పని చేసుకుంటూ చిన్నారిని పెంచుతున్నారు. దివ్యాంగురాలు రజిత పరిస్థితిని తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శనివారం వెంకటాయపల్లిలోని ఆమె ఇంటికి స్వయంగా వెళ్లి రజిత పరిస్థితి గురించి ఆరా తీశారు. చిన్నారి పరిస్థితిని గమనించి చలించిన ఎమ్మెల్యే అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆ కుటుంబానికి భరోసా కల్పించారు. ఎంపిడివోతో మాట్లాడి రజితకు వికలాంగుల పెన్షన్ వచ్చేలా చూడాలని ఆదేశించారు. పెన్షన్ మంజూరుకి హామి ఇచ్చిన ఎమ్మెల్యేకు రజిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంకిడి సంధ్య రాంచంద్రారెడ్డి, ఉప సర్పంచ్ ఆసిఫ్, మోహన్ రెడ్డి, గుర్రం నర్సగౌడ్, సురేశ్, జయంత్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## తబితా ఆశ్రమంలో రాఖీ వేడుకలు

ప్రజాపక్షం/రామగుండం: రామగుండం పట్టణంలోని తబితా బాలల సంరక్షణ కేంద్రంలో ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ ఆధ్వర్యంలో రాఖీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బాలికలు సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. ఆశ్రమంలో చిన్నారుల రక్షాబంధన్ సందడితో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో నాయకులు గౌస్, రమేష్, ఆశ్రమ నిర్వాహకుడు వీరేందర్ నాయక్‌లు పాల్గొన్నారు.

## ఎన్‌టిపిసి రామగుండంలో ఎన్‌ఒసెట్- 2026

ప్రజాపక్షం/గోదావరిఖని : ఉద్యోగులు తమ జ్ఞానాన్ని, సృజనాత్మకతను, వినూత్న ఆలోచనా విధానాన్ని ప్రదర్శించడానికి ఒక ఉత్తేజకరమైన వేదికను అందిస్తూ, ఎన్‌టిపిసి రామగుండంలోని ఈడీసీ మిలినీయం హాల్‌లో ప్లాంట్ స్థాయి ఎన్‌ఓసెట్2026 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో మొత్తం 9 జట్ల ఉద్యోగులు పాల్గొన్నారు. తమ విశ్లేషణాత్మక సామర్థ్యాలను, సంస్థాగత శ్రేష్ఠత పట్ల నిబద్ధతను ప్రతిబింబిస్తూ, విభిన్న అంశాలపై లోతైన ఆలోచనలను సమర్పించారు. 'పర్యావరణ్' జట్టు ప్లాంట్‌స్థాయి ఎన్‌ఓసెట్2026 విజేతగా నిలిచింది. రాబోయే ప్రాంతీయ స్థాయి పోటీల్లో ఎన్‌టిపిసి రామగుండం తరపున ఈ జట్టు ప్రాతినిథ్యం వహించనుంది. ఎన్‌టిపిసి ఈ.డీ.(ఆర్అండ్‌టి) చందన్ కుమార్ సమంత అధ్యక్షతన జరిగిన ప్రారంభ, ముగింపు కార్యక్రమంలో విజేత జట్టుతోపాటు పాల్గొన్న అన్ని జట్ల ఉద్యోగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల జీఎంలు, సీనియర్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## మాజీ జెడ్‌పిటిసిని పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు



ప్రజాపక్షం/ముత్తారం: అనారోగ్యంతో బాధపడుతున్న ముత్తారం మాజీ జడ్పీటీసీ,సీనియర్ నాయకులు నాగినేని జగన్ మోహన్ రావును శనివారం ముత్తారం మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు పరామర్శించారు. కరీంనగర్‌లోని జగన్ మోహన్ రావు నివాసానికి వెళ్లిన ముత్తారం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి,సింగిల్ విండో మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ,ముత్తారం సర్పంచ్ సుదాటి రవీందర్ రావు ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ పరామర్శించిన వారిలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి:** మండల కేంద్రం లోని 6వ వార్డులో గ్రామపంచాయతీ రూ.3ల క్షల నిధులతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులను శనివారం సర్పంచ్ కొత్తపల్లి హారిక, ఉపసర్పంచ్ కొత్తపల్లి అశోక్ ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో పారిశుధ్య సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తున్నా మని చెప్పారు. గ్రామప్రజల సహకారంతో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని తెలి పారు.వార్డు సభ్యులు లోలం సురేష్, వీడీసీ అధ్యక్షులు సుభాష్‌గౌడ్, కాంట్రాక్టర్ కొత్తపల్లి అనిల్, పీర్ల అరవింద్, రెంజర్ల మహేందర్, ఉట్నూర్ రాజేష్, ఉట్నూర్ క్రాంతి, ధోని, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## 3 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**ప్రజాపక్షం/మోర్తాడ్ :** మండలంలోని దొన్కల్ గ్రామంలో అక్రమంగా ఇసుక తరలి స్తున్న 3 ఇసుక ట్రాక్టర్లను ఛీత ఫోర్స్ పట్టుకుం దని ఎస్సై బి.రాము తెలిపారు. కాగా శుక్ర వారం ఉదయం గ్రామశివారులోని పెద్దవాగు నుండి కొన్ని రోజుల నుండి అక్రమంగా ఇసు కను తరలిస్తున్నారని తెలిసి శుక్రవారం ఉదయం చిత ఫోర్స్ దాడి చేసి ఇసుక తరలి స్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఒక ఖాళీ ట్రాక్ట రను పట్టుకుని మోర్తాడ్ పోలీసులకు అప్పగిం చారని ఎస్సై రాము తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్ప వని ఎస్సై రాము హెచ్చరించారు.

## 19వ మహాజన సభ

**ప్రజాపక్షం/బాల్కొండ :** మండల కేంద్రం లోని మహిళా సమాఖ్య కార్యాలయంలో శని వారం 19 వ మహాజన సభ ఘనంగా నిర్వ హించామన్నారు. ఈ సందర్భంగా 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సమావే శంలో ఆర్థిక లావాదేవీలు కార్యదర్శి జయంతి చదివి వినిపించి ఆమోదించారు. 202526 లో సమాఖ్య అర్జించిన రూ.226526 లాభం అర్జించిందని, 2024 25 కంటే ఈ సంవత్సరం రూ.164106 లాభం రావటం జరిగిందన్నారు. ఈసీ, పదా దికారుల ఖాళీలు భర్తీ చేశామన్నారు. అధ్యక్షు రాలుగా స్వరూప (కిసాన్‌నగర్), కార్యద ర్శిగా రాజ్యలక్ష్మీ (బాల్కొండ, కోశాధికారిగా శ్రీలత (బాల్కొండ) ఎన్నికయ్యారన్నారు. ఈ సందర్భంగా ఎపియం గంగారాం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్ర మంలో యుబిఐ బ్యాంకు మేనేజర్ సాయిద ర్శన్‌రెడ్డి, 25 గ్రామసంఘాల అధ్యక్షులు, ఎపియం గంగారాం, సిబ్బంది నవీన్, సుష్మ, స్వరూపరాణి, సాయన్న, యుగేందర్ పాల్గొ న్నారు.

## సర్ మార్పులు, చేర్పుల నోటీసుల పరిశీలన

**ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి:** సర్ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాల్లో పేర్కొన్న వివరాల్లో తప్పులు, లోపాలు ఉన్నట్లు గుర్తించి ఆయా ఓటర్లకు ఎన్నికల సంఘం నోటీసులు అందచేసింది. శనివారం నిజామా బాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం మాదాపూర్ గ్రామంలో సర్ మార్పులు, చేర్పుల నోటీసు లను తహసీల్దార్ కిరణ్మయి, ఎంపిడిఒ సతీష్ కుమార్‌లు పరిశీలించారు. పేర్లలో, వయ స్సులో తేడాలను సరిచేయడంతో పాటు తప్పులు లేకుండా సర్ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని అధికా రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శి, సర్పంచ్, గ్రామ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** తెలంగాణ ఉద్యమకారులని ఆదుకోవాలని ఆదేప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు తెలంగాణ ఉద్య మకారుడు ఈర్ల శేఖర్‌కు అందించి వారికి మనోధైర్యంను కల్పించి పరామర్శించారు. శనివారం పోచమ్మ గల్లీలోని ముదిరాజ్ వీధిలో ఈర్ల శేఖర్ నివాసానికి తెలంగాణ ఉద్య మకారులు కోనేరు సాయికుమార్, కరిపె రాజు, తుమ్మ నాగభూషణం, పాశుగంటి మహేష్, స్వర్గం రమేష్‌లతో పాటు ఆదే ప్రవీణ్‌కుమార్ కలిసి అనారోగ్యంతో బాధపడు తున్న ఈర్ల శేఖర్‌కు అండగా ఉంటామని తెలిపారు.సంవ త్సర కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎందరో నాయకులు ప్రాణాలను లెక్క చేయ కుండా కొట్లాడారని గుర్తు చేశారు. తెలంగాణ వస్తే నీళ్లు నిధులు నియామకాలు జరుగుతాయని ఆశించి ఉద్య మంలో చురుగ్గా పాల్గొన్నమన్నారు. కానీ తెలంగాణ వచ్చాక కొన్ని కుటుంబాలకు మాత్రమే న్యాయం జరిగిం దని, నిజంగా పోరాడిన ఉద్యమకారులకు అన్యాయం జరి గిందన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమానికి చురుకుగా పాల్గొన్నటువంటి ఈర్ల శేఖర్ నడవలేని స్థితిలో ఇంటికే పరి మితమై ఉన్నాడని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలన్నారు. తాను స్వచ్ఛందంగా ముందుకొచ్చి కొంత సాయం చేశా నని, ఉద్యమంలో పని చేసిన ప్రతిఒక్కరిని ఆదుకోవల్సిన అవసరముందన్నారు. ఉద్యమం కోసం అలుపెరగని పో రాటం చేసిన ముఖ్యుల్లో ఈర్ల శేఖర్ మొదటి స్థానంలో ఉన్నారని శనివారం ఆరోగ్య పరిస్థితిని అర్థం చేసుకుని ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. తొమ్మిది న్నర యేళ్లకు పైగా అధికారంలోని బీఆర్ఎస్ పార్టీ ఒక్క ఉద్యమకారునికి కూడా న్యాయం చేయలేకపోయింద న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను ఆదుకుని ఉచిత బస్సు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, పెన్షన్ లాంటి సౌక ర్యాలు కల్పించాలని కోరాడు.

# ఫ్రేమ్స్ ఆఫ్ ఫౌండర్స్ స్థానిక కథలకు సినిమాటిక్ ఫ్రేమ్

### నిజజీవిత కథలకు కొత్త ప్రయాణం



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నిజామాబాద్‌లో ఫ్రేమ్స్ ఆఫ్ ఫౌండర్స్ ఆధ్వర్యంలో స్థానిక కథలకు అవకాశముంటుం దని సినికా క్రియేటర్స్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పంజా శ్రావణ్ అన్నారు. శనివారం ర్యాంప్ పథకం కింద సినిమా టికా ఎక్స్‌పో, సినికా క్రియేటర్స్ కౌన్సిల్, ఎన్ఐఎంఎస్ ఎంఈ సహకారంతో జీజీ కళాశాల ఆడిటోరియంలో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల నుంచి పాల్గొ న్నారు. ఈ సందర్భంగా పంజా శ్రావణ్ స్థానిక కథే ప్రపంచ స్థాయి కథ కావచ్చన్నారు. వ్యవస్థాపకుల విజ యాలు, పోరాటాలు, ఆలోచనలను సినిమాటిక్ కథలుగా మలచేందుకు 'ఫ్రేమ్స్ ఆఫ్ ఫౌడర్స్ కార్యక్రమాన్ని నిర్వ హించారన్నారు. సినిమా ఒక అవకాశమన్నారు. ఫిల్మ్‌మే కింగ్, విఎఫ్ఎక్స్, యానిమేషన్, కంటెంట్ క్రియేషన్, స్టోరీ టెల్లింగ్ రంగాల్లో అవకాశాలను యువతకు పరిచయం చేశారు. నిజ జీవిత కథలను గుర్తించి వాటిని విజువల్ కథ నాలుగా మలచే విధానాన్ని వివరించారు. ప్రతి జిల్లాలోనూ ప్రపంచాన్ని ఆకట్టుకునే నిజ జీవిత కథలున్నాయన్నారు. వ్యవస్థాపకుడి విజయంతో పాటు ఆ విజయం వెనుకున్న ఆలోచన, కష్టాలు, వైఫల్యాలు, పట్టుదలను కూడా కథగా చెప్పాలి. స్థానిక ప్రతిభతో అలాంటి కథలను సినిమాటిక్ రూపంలో ప్రజల ముందుకు తీసుకరావటమే 'ఫ్రేమ్స్ ఆఫ్ ఫౌండర్స్' లక్ష్యమన్నారు. క్రియేటివ్ రంగాలను ఉద్యోగా లతో పాటు స్వయం ఉపాధి ఫ్రీలాన్సింగ్, స్టార్టప్‌లకు అవ కాశాలుగా చూడాలని యువతకు సూచించారు.

# అడుగడుగునా గుంతలే... గోతులే ప్రాణాంతకం

### మండలంలో దారి తప్పిన రహదారులు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండలంలోని పలు గ్రామాల్లో రహదారుల పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ జల్లెడలా మారి అడు గడుగునా పెద్ద ఎత్తున గుంతలు లేవడంతో వాహనదా రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దూపల్లి గేట్ నుంచి దూపల్లి మీదుగా రెంజల్ వెళ్లే ప్రధాన రహదారి గుంలమయమై, ప్రయాణికులకు నరకాన్ని తలపిస్తుంది.

### ఫీటు లోతు గుంతలు.. నిత్యం ప్రమాదాలు

రహదారి ఈ స్థాయిలో ధ్వంసం కావడానికి వ్యవసాయ పనుల కోసం వినియోగించే కేజీవీల్ ట్రాక్టర్లే ప్రధాన కార ణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. పొలాల నుంచి నేరుగా రక్షణ లేని ఇనుప చక్రాలతో రోడ్లపైకి రావడం వల్ల తారు రోడ్డు పొరలు ఊడిపోయి పెద్ద పెద్ద గుంత లుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి అధ్వాన్నంగా తయారై ప్రయాణికుల ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని ప్రయాణిస్తున్నా.. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేప ట్టాలని, కేజీవీల్ ట్రాక్టర్లు రోడ్లపైకి రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరుతు న్నారు. ఇకనైనా స్పందించి నూతన రహదారి నిర్మించా లని వాహనదారులు హెచ్చరిస్తున్నారు.

# రాఖీ వేళ తనిఖీలు.. చర్యలేవీ?



**ప్రజాపక్షం/నిర్మల్ :** రాఖీ పండగను పురస్కరించుకుని నిర్మల్ పట్టణంలో మున్సిపల్, ఫుడ్ సేఫ్టీ అధికారులు పలు స్వీట్ షాపులు, హోటళ్లలో తనిఖీలు నిర్వహిం చారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఫుడ్ ఇన్స్పెక్టర్ సునీత,శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కలిసి ప్రధాన స్వీట్ షాపుల్లో విక్రయిస్తున్న తినుబండా రాలు,స్వీట్ల నాణ్యతను పరిశీలించారు.స్వీట్లు ఎక్కడ తయారవుతున్నాయనే వివరాలను సేకరించి తయారీ కేంద్రాలను సైతం పరిశీలించిన అధికారులు, నోటీసులు జారీ చేయడంతో పాటు పలు ఆహార నమూనాలను సేక రించారు. ప్రముఖ నారాయణ స్వీట్ హోమ్‌తో పాటు పలు హోటళ్లలో తనిఖీలు చేపట్టారు.అయితే అధికారులు తనిఖీలు నిర్వహించి నమూనాలు సేకరించినప్పటికీ.. అనంతరం తీసుకున్న చర్యలపై స్పష్టత లేకపోవడంపై పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.పండగల సమయంలో అధి కారులు తనిఖీలు నిర్వహించడం, నమూనాలు సేకరిం చడం, నోటీసులు ఇవ్వడం సాధారణంగా మారిందని, కల్తీ లేదా నాణ్యత లోపాలు బయటపడితే సంబంధిత వ్యాపారులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



**ప్రజాపక్షం/మావల:** క్రీడా పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ రాజ ర్షిషా అన్నారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవం, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుషాతో కలిసి ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడా జ్యోతి వెలిగించి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడాకారుల ప్రగతికి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని, జిల్లా విద్యార్థులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షిం చారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. అనంతరం పూర్వ క్రీడాకారులను సత్కరించారు. కార్యక్ర మంలో డివైఎస్ఓ దయానంద్ రెడ్డి, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాపై అప్రమత్తంగా ఉండాలి

### మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి




**ప్రజాపక్షం/మావల:** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు కీలక పాత్ర పోషించాలని ఆది లాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మావలలోని రత్నా గార్డెన్‌లో శనివారం నిర్వహించిన బీఎల్ఏ2 అవ గాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఏ ఒక్క ఓటరు కూడా పేరు కోల్పోకుండా శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజక వర్గ పరిశీలకులు కొట్నాక్ తిరుపతి, డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, మాజీ ఎంపీ సోయం బాపురావు, నాయకులు నర్సయ్య, సంతోష్ రావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై నిరసనలు

### జోగు రామన్న



**ప్రజాపక్షం/మావల:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో విఫలమైందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో మండల, పట్టణ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 1 నుంచి 8 వరకు ప్రభుత్వంపై నిరసన కార్యక్రమాలు చేప డుతున్నామని తెలిపారు. రైతు బంధు, కళ్యాణలక్ష్మీ, ఫీజు రీయింబ ర్స్‌మెంట్ తదితర హామీలు నెరవేర్చే వరకు పోరాడతామన్నారు. కార్యక్రమంలో రౌతు మనోహర్, అలాల్ అజయ్, సలీం, లింగారెడ్డి, ప్రమోద్ రెడ్డి పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో తీవ్రమైన వర్గపోరు

**ప్రజాపక్షం/నేరడిగొండ:** ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో అంత ర్గత విభేదాలు రచ్చకెక్కాయి. డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ ఏకపక్ష వైఖరిపై బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ శనివారం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. పీసీసీ కమిటీ నియామకం, సహకార సంఘాల చైర్మన్ల ఎంపికలో డీసీసీ అధ్యక్షుడు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని గజేందర్ వర్గం ఆరోపించింది. అలాగే జిల్లా కేంద్రంలో కంది శ్రీని వాసరెడ్డి, అల్లూరి సంజీవరెడ్డి వర్గాల మధ్య తీవ్ర విభేదాలు కొనసా గుతున్నాయి.

## పెంబిలో మెటీరియల్ రికవరీ ఫెసిలిటీకి స్థల పరిశీలన

ప్రజా పక్షం/పెంబి : పెంబి పట్టణంలో మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు.సైడా వ్యవస్థాపకుడు డాక్టర్ మాథ్యూ మట్టం,ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగాధర్,ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ద్విజయ్ కుమార్ పాల్గొన్నారు.ప్లాస్టిక్, ఇనుము,తదితర వ్యర్థాలను సేకరించి పునర్వినియోగం చేసే ఫెసిలిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.సర్పంచ్ సత్యనారాయణ స్వామి,వీడీసీ నాయకులు పాల్గొన్నారు.

## యోగా ద్వారా శరీరానికి శక్తిమానసిక ప్రశాంతత

ప్రజాపక్షం/బోథ్ : బోథ్ మండలం కేంద్రంలో ఆదర్శ పాఠశాలలో శనివారం యోగా శిక్షకురాలు మాట్లాడుతూ యోగా మన శరీరాన్ని ఆరోగ్యంగా, దృఢంగా, చురుకుగా ఉంచడంతో పాటు మనసుకు ప్రశాంతతను అందిస్తుందని యోగ శిక్షకురాలు మునిగెల యోగిత తెలిపారు.ప్రతిరోజూ యోగా సాధన చేయడం వల్ల ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, శ్వాస నియంత్రణ మెరుగుపడతాయనితెలిపారు.క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల ఆత్మవిశ్వాసం, మానసిక ప్రశాంతత, చదువుపైఆసక్తిపెంపొందించుకోవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల బోథ్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులుభోజన్న,నితిన్ ,సుధారాణి, హేమలత, కృష్ణ జ్యోతి, తిరుపతి రెడ్డి తోపాటు విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆంజనేయుడు విగ్రహం ప్రతిష్ఠాపనకి శంకుస్థాపన

ప్రజాపక్షం/బోథ్ : బోథ్ మండల కేంద్రంలోని మైసమ్మ కాలనీ లో గల శ్రీ కేదారనాథ్ శివాలయం దగ్గర నూతనంగా ప్రతిష్ఠాపన చేస్తున్న ఆంజనేయుడు విగ్రహం కి శనివారం భూమి పూజ ఆలయ కమిటీ వారికి చేశారు.త్వరలో నిర్మాణ పనులు అయ్యి ఆంజనేయుడి విగ్రహం ప్రతిష్ఠాపన చేస్తాం అని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లో ఆలయ కమిటీ సభ్యులు జైనూర్ నారాయణ,పాలిక్ రమేష్,తుమ్ గంగయ్య,మాసం అనిల్ కుమార్,ఆడెపు నరేష్,నరం శెట్టి ప్రకాష్,కమటం ఆకాష్,కట్కం మల్లికార్జున్ మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడా నైపుణ్యాన్ని అలవర్చుకోవాలి

ప్రజాపక్షం/నర్సాపూర్ జి : ప్రతి విద్యార్థి క్రీడలలో ప్రతిభపొందేలా క్రీడా నైపుణ్యాన్ని అలవర్చుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్ర కుమార్ ఉద్బోధించారు. శనివారం మధ్యాహ్నం పాఠశాల ప్రాంగణంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేజర్ ధ్యాన్ చంద్ హాకీ మాంత్రికుడిగా పేరు పొంది, మన భారతదేశానికి ఒలంపిక్స్ లో మూడుసార్లు బంగారు పతకాన్ని సాధించిన గొప్ప క్రీడాకారుడని కొనియాడడం జరిగింది.దేశంలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడా పాలసీలను రూపొందించడం జరుగుతుందని, కావున విద్యార్థులందరూ వీటిని ఉపయోగించుకొని వివిధ క్రీడాంశాలలో గొప్ప క్రీడాకారులుగా తయారు కావాలని వారు ఆకాంక్షించారు. లేబర్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు సతీష్,నీలేష్, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు దర్శనం దేవేందర్ మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# మహిళా పారిశ్రామికవేత్తల ఉన్నతికి 'ర్యాంప్' వరం



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : మహిళలు పారిశ్రామిక రంగంలో రాణించి ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. మహిళా పారిశ్రామికవేత్తలు తమ వ్యాపారాలను మరింత విస్తరించుకునేందుకు 'ర్యాంప్–ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం' చక్కటి అవకాశమని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వ ఐటీ,ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ ఆధ్వర్యంలోని విహబ్ సౌజన్యంతో జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలు, మహిళా పారిశ్రామికవేత్తల కు శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'ర్యాంప్–ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం'పై అవగాహన సదస్సు నిర్వహించారు.ప్రపంచ బ్యాంకు, కేంద్ర సూక్ష్మ , చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ సంయుక్త సహకారంతో 'ర్యాంప్' పథకాన్ని అమలు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న సూక్ష్మ , చిన్న తరహా వ్యాపార సంస్థలను మరింత వేగంగా అభివృద్ధి చేయడం, వాటి సామర్థ్యాన్ని పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పథకం కింద ఎంపికైన మహిళా పారిశ్రామికవేత్తలకు రెండేళ్లపాటు ప్రత్యేక శిక్షణ, మార్గదర్శకత్వం,అవసరమైన సహకారం అందిస్తారని నిర్వాహకులు తెలిపారు. జౌళి, ఆహార శుద్ధి, తయారీ,చేతివృత్తులు,హస్తకళలు తదితర రంగాల్లోని వ్యాపార సంస్థలకు ప్రోత్సాహం కల్పిస్తారన్నారు.వ్యాపార నిర్వహణ నైపుణ్యాల పెంపు, ఉత్పత్తుల నాణ్యత మెరుగుదల, కొత్త ఉత్పత్తుల రూపకల్పన, ఉత్పత్తుల వైవిధ్యీకరణ,బ్రాండింగ్, మార్కెటింగ్‌లో అవసరమైన సహకారం అందిస్తారని వివరించారు. బ్యాంకుల ద్వారా రుణ అనుసంధానం కల్పించడంతో పాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులతో వ్యక్తిగత మెంటరింగ్ అందించి వ్యాపారాలను మరింత లాభదాయకంగా తీర్చిదిద్దేందుకు తోడ్పాటునందిస్తారని తెలిపారు.సదస్సులో 'ర్యాంప్–ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం'కు సంబంధించిన అర్హతలు, ఎంపిక విధానం, శిక్షణ, ప్రయోజనాలు, వ్యాపార విస్తరణకు అందించే సహకారంపై మహిళలకు అధికారులు అవగాహన కల్పించారు. వ్యాపారాలను విస్తరించేందుకు ఆసక్తి చూపిన పలువురు మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.డీపీఎం మారుతి, విహబ్ డైరెక్టర్ జాహిద్ షేక్, అసోసియేట్ డైరెక్టర్ ఊహ, ప్రతినిధులు డాక్టర్ డెబోశ్రీ, రూపానంద్, హరిచందన,స్వయం సహాయక సంఘాల మహిళలు,మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# యోగా ద్వారా శరీరానికి శక్తిమానసిక ప్రశాంతత



ప్రజాపక్షం/బోథ్ : బోథ్ మండలం కేంద్రంలో ఆదర్శ పాఠశాలలో శనివారం యోగా శిక్షకురాలు మాట్లాడుతూ యోగా మన శరీరాన్ని ఆరోగ్యంగా,దృఢంగా, చురుకుగా ఉంచడంతో పాటు మనసుకు ప్రశాంతతను అందిస్తుందని యోగ శిక్షకురాలు మునిగెల యోగిత తెలిపారు.ప్రతిరోజూ యోగా సాధన చేయడం వల్ల ఒత్తిడి తగ్గి,ఏకాగ్రత,జ్ఞాపకశక్తి, శ్వాస నియంత్రణ మెరుగుపడతాయని తెలిపారు. శరీరంలో వశ్యత,సమతుల్యత పెరగడంతో పాటు మంచి నిద్ర, ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు.ముఖ్యంగా విద్యార్థుల్లో చదువుపై శ్రద్ధ, క్రమశిక్షణ,ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు యోగా దోహదపడుతుందని పేర్కొన్నారు.ఆరోగ్య పాఠశాల–3 కార్యక్రమంలో భాగంగా కాగ్నిటివ్ ముద్రలను కొత్తగా చేర్చినట్లు యోగిత తెలిపారు.కాగ్నిటివ్ ముద్రను యోగా,ధ్యానంతో కలిపి సాధన చేయడం ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత పెరగడంతో పాటు మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడానికి సహాయపడుతుందన్నారు.చదువుతున్న సమయంలో దృష్టిని కేంద్రీకరించుకోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం,శ్రద్ధను మెరుగుపరచుకోవడంలో ఇది ఉపయోగపడుతుందని తెలిపారు.క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల ఆత్మవిశ్వాసం, మానసిక ప్రశాంతత, చదువుపై ఆసక్తి పెంపొందించుకోవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల బోథ్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్,ఉపాధ్యాయులు భోజన్న,నితిన్,సుధారాణి,హేమలత, కృష్ణ జ్యోతి,తిరుపతి రెడ్డి,పాటు విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలుగు భాషా,జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

ప్రజా పక్షం /ఖానాపూర్ : ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ పీఎం ఉన్నత పాఠశాలలో శనివారం గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం,హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ తెలుగు భాష అలాగే క్రీడలకు సంబంధించిన ప్రాజెక్టుల ప్రదర్శనను ఏర్పాటు చేశారు.విద్యార్థులు తమ సృజనాత్మకతను వెలికితీస్తూ తెలుగు భాష, సాహిత్యం, పదజాలం, క్రీడలు,క్రీడా విలువలు తదితర అంశాలపై ఆకర్షణీయమైన ప్రాజెక్టులను రూపొందించారు.ప్రదర్శనలో ఉంచిన ప్రాజెక్టులను పాఠశాల విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.అనంతరం గిడుగు రామ్మూర్తి, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి వారి సేవలను కొనియాడారు.ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్ మాట్లాడుతూ పుస్తకాల్లో నేర్చుకున్న విషయాలను ప్రాజెక్టుల రూపంలో స్వయంగా తయారు చేయడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశీలన,విషయ పరిజ్ఞానం పెరుగుతాయి.తెలుగు భాషపై అభిమానం, క్రీడలపై ఆసక్తి పెంపొందించేందుకు ఎంతో దోహదపడతాయని అన్నారు.తెలుగు ఉపాధ్యాయులు వెన్నం అంజయ్య మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులు ప్రాజెక్టుల ద్వారా సృజనాత్మకంగా ఆవిష్కరించడం అభినందనీయం.భాషను కేవలం పాఠ్యాంశంగా కాకుండా జీవితంలో భాగంగా చేసుకోవాలి అని పేర్కొన్నారు.

దిలావార్‌పూర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రోజున జాతీయా క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ముందుగా సర్పంచ్ అక్షర అనిల్,ఎ ఎస్ ఐ లక్ష్మీ నారాయణ క్రీడ జ్యోతి ని వెలిగించి, జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యా యులు ఎ.నాగభూషణం మాట్లాడుతూ హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ అధ్వర్యంలో భారత్ మూడూ సార్లు ఒలంపిక్స్ లో స్వర్ణ పతకం సాధించిందని చెప్పారు.క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వానికి దోహదపడుతాయని అన్నారు.వ్యాయమ ఉపాధ్యాయుడు అంబాజీ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని క్రీడల ద్వారా కో అపరేషన్ పెరుగుతుందని అన్నారు.వ్యాయమ ఉపాధ్యాయుడు అంబాజీ వల్ల క్రీడల పట్ల ఆసక్తి పెరిగిందని పలువురు విద్యార్థులు అన్నారు. ఈ దినోత్సవాన్ని ఇంత ఘనంగా జరపడానికి సహకరించిన ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు.ఈ కార్యక్రమములో సీనియర్ ఉపాధ్యాయులు వామన్ రావ్, లక్ష్మణరావు పోశెట్టి,రమేష్ తదితరులు మాట్లాడినారు. పాఠశాల సిబ్బంది,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.



## వేదం పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం వేడుకలు

ప్రజాపక్షం/లోకేశ్వరం : లోకేశ్వరం మండలంలోని వేదం పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం మరియు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా వేదం పాఠశాల,ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయురాలు కవిత బి. పోశెట్టి వ్యాయామ ఉపాధ్యాయులు పోశెట్టి వేదం పాఠశాల ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు ఘనంగా సన్మానించారు.ఉపాధ్యాయులు మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని చాటుతూ క్రీడల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డి.రమేష్,రవీందర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు తక్షణమే విడుదల చేయాలి

### నిర్మల్‌లో బీజేవైఎం నిరసన దీక్ష

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు నిర్మల్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో బకాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం బీజేపీ లడాయి నిరసన దీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దొడ్డికింది నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 40 లక్షల మంది విద్యార్థులకు చెల్లించాల్సిన రూ. 15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి నిధులు చెల్లించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అనంతరం నాయకులు నిమ్మరసం తాగి దీక్ష విరమించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రమేష్,పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్, కౌన్సిలర్లు,సీనియర్ నాయకులు రావుల రాంనాథ్,మేడిసెమ్మ రాజు, సత్యం చంద్రకాంత్,బిజెవైఎం నాయకులు దినేష్,వెంకటేష్,హరీష్,శ్రీకాంత్,విద్యార్థులు, పాల్గొన్నారు.

## బూరుగుపల్లిలో లేగదూడపై చిరుతపులి దాడి

### ఘటనా స్థలాన్ని పరిశీలించిన అటవీ అధికారులు



ప్రజాపక్షం/నర్సాపూర్ జి : నర్సాపూర్ జి మండలం బూరుగుపల్లి గ్రామంలో చిరుతపులి సంచారం కలకలం రేపింది.గ్రామానికి చెందిన పశువుల వద్దకు వచ్చిన చిరుతపులి ఓ లేగదూడపై దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు.అయితే పశువుల కాపరి అప్రమత్తమై వెంటనే స్పందించడంతో చిరుతపులి నుంచి లేగదూడను రక్షించగలిగారు.చిరుతపులి దాడితో భయాందోళనకు గురైన గ్రామస్తులు వెంటనే సంబంధిత అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది బూరుగుపల్లి గ్రామానికి చేరుకుని ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు.లేగదూడ పరిస్థితిని కూడా పరిశీలించి, గ్రామ పరిసరాల్లో చిరుతపులి సంచారం ఉందా అనే విషయంపై ఆరా తీశారు.గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని,రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లవద్దని అటవీ శాఖ అధికారులు సూచించినట్లు తెలిసింది.పశువులను కూడా రక్షణ లేకుండా బయట ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.చిరుతపులి సంచారం నేపథ్యంలో గ్రామంలో భయాందోళన నెలకొంది. అధికారులు తగిన చర్యలు తీసుకుని చిరుతపులి సంచారాన్ని గుర్తించి,ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## బన్సపల్లి గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజా పక్షం/దిలావర్ పూర్ : మండలంలోని బన్సపల్లి గ్రామంలో శనివారం రోజున డాక్టర్ అగర్వాల్ కంటి క్లినిక్ నిర్మల్ వారు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరంలో గ్రామస్తులకు మరియు పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి,కంటి సమస్యలపై వైద్యులు అవగాహన కల్పించారు.అవసరమైన వారికి మందులు అందజేశారు.ఆపరేషన్ చేస్తామని తెలిపారు.కంటి చూపు సమస్యలు,కంటి ఒత్తిడి,ఇతర కంటి సంబంధిత సమస్యలను వైద్యులు పరీక్షించారు.ప్రజలు పెద్ద సంఖ్యలో శిబిరానికి హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా కంటి వైద్య సేవలు అందించడం పట్ల గ్రామస్తులు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లయ్య,వైద్యులు,ప్రజలు పాల్గొన్నారు.

# క్రీడా స్ఫూర్తికి ధ్యాన్‌చంద్ ప్రతీక

**ప్రజాపక్షం/మందమర్రి:** హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ క్రమశిక్షణ, పట్టుదల, క్రీడా స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనమని పొన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాఫెల్ రెడ్డి, పిఇటి శ్రీనివాస్ పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడల వల్ల శారీరక దారుఢ్యం, మానసిక వికాసం కలుగుతాయని తెలిపారు. విద్యార్థి దశ నుంచే పట్టుదలతో సాధన చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశానికి పతకాలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్‌లో జిల్లా స్థాయి సైన్స్ డ్రామా

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్:** పట్టణంలోని డివిజనల్ సైన్స్ సెంటర్‌లో శనివారం జిల్లా స్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వివిధ మండలాల నుంచి సుమారు 100 మంది విద్యార్థులు హాజరై శాస్త్రీయ అంశాలపై నాటకాలను ప్రదర్శించారు. మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, సామాజిక బాధ్యతను పెంపొందించడమే లక్ష్యంగా సైన్స్ అండ్ సొసైటీ ప్రధాన ఇతివృత్తంతో ఈ పోటీలు నిర్వహించారు. ఇలాంటి ప్రదర్శనల ద్వారా శాస్త్రీయ ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలు మెరుగవుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీ నరసింహ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ముంజము రాజేశ్వర్, దుర్గము జనార్ధన్, జిల్లా సైన్స్ అధికారి కటుకం మధూకర్, నాయకులు మామిడాల తిరుపతయ్య, ధర్మపురి వెంకటేశ్వర్లు, దుర్గాప్రసాద్, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

# జపాన్ విద్యా పర్యటనకు ప్రధానోపాధ్యాయుడు రంగయ్య ఎంపిక

**ప్రజాపక్షం / కెరమెరి:** రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జపాన్ విద్యా పర్యటనకు సావర్‌ఖేడ్ ఎంపిపిఎస్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కదేర్ల రంగయ్య ఎంపికయ్యారు. సెప్టెంబర్ 5 నుంచి 12వ తేదీ వరకు జరిగే ఈ పర్యటనలో రాష్ట్రం నుంచి 30 మంది ఉపాధ్యాయులు, 10 మంది అధికారులు పాల్గొననున్నారు. జపాన్‌లో అమలవుతున్న ఆధునిక విద్యా విధానాలు, బోధన పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పాఠశాలల నిర్వహణపై ఈ బృందం అధ్యయనం చేయనుంది. అక్కడి ఉత్తమ విద్యా విధానాలను పరిశీలించి మన పాఠశాలల్లో అమలు చేయడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది. ఈ పర్యటనకు రంగయ్య ఎంపిక కావడంపై స్థానిక ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. అక్కడి విద్యా విధానాలను అధ్యయనం చేసి స్థానిక విద్యార్థులకు మరింత మెరుగైన బోధన అందించేందుకు కృషి చేస్తానని ప్రధానోపాధ్యాయుడు రంగయ్య పేర్కొన్నారు.

# ఘనంగా మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను నిర్మల్‌లో ఘనంగా నిర్వహించారు.జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశాలతో జిల్లా యువజన,క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా హాకీ అసోసియేషన్ సహా ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల అధికారి బి.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ భారత హాకీకి ప్రపంచస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో మేజర్ ధ్యాన్‌చంద్ చేసిన కృషి,ఆయన ప్రతిభ,అంకిత భావం చిరస్మరణీయమని అన్నారు.ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు,యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుని రాష్ట్ర,జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.క్రీడలు కేవలం పోటీలకే పరిమితం కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగం కావాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు.ప్రతిభావంతులైన క్రీడాకారులకు క్రీడా కోటా ద్వారా ప్రభుత్వంతో పాటు వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు.యువత తమ ప్రతిభను గుర్తించి క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రాథోడ్ లక్ష్మణ్, జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు పాకాల రాంచందర్, పీడీలు రమణారావు,రవీందర్ గౌడ్,అన్నపూర్ణ,భూమన్న, సత్తయ్య, బుచ్చిరామారావు,సుధార్‌సింగ్,పోశెట్టి,వంశీ కె. శ్రీనివాస్,పీఈటీలు సంజీవ్,గంగాధర్, ముకేష్,భీమేశ్, గిరి, వ్యాయామ ఉపాధ్యాయులు,క్రీడాకారులు,యువత,తదితరులు పాల్గొన్నారు.

# శిశుమందిర్‌లో రాష్ట్ర స్థాయి గణిత విజ్ఞాన సాంస్కృతిక మేళా



**ప్రజాపక్షం/ముధోల్ :** శిశుమందిర్ పాఠశాల విద్యార్థుల్లో గణిత, విజ్ఞాన శాస్త్రాలపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు భారతీయ సంస్కృతి,సంప్రదాయాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో రాష్ట్ర స్థాయి గణిత విజ్ఞాన సాంస్కృతిక మేళా నిర్మల్ జిల్లా ముధోల్‌లో నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ విభాగ్ కార్యదర్శి సరికొండ దామోదర్,విభాగ్ శైక్షణిక్ ప్రముఖ్ కళిమహంతి వేణుమాధవ్ తెలిపారు.ఆగస్టు 30, 31 మరియు సెప్టెంబర్ 1 తేదీలలో మూడు రోజుల పాటు జరిగే ఈ మేళాకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన శిశుమందిర్ పాఠశాలల విద్యార్థులు,ఉపాధ్యాయులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. విద్యార్థులు గణిత,విజ్ఞాన శాస్త్రాలకు సంబంధించిన వివిధ నమూనాలు, ప్రదర్శనలు ఏర్పాటు చేసి తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. ఆగస్టు 30న మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక శాసన సభ్యులు పవార్ రామారావు పటేల్, నిర్మల్ జిల్లా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేసి కార్యక్రమం ప్రారంభం చేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులు,సభాధ్యక్షులు,వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై విద్యార్థులను ప్రోత్సహించనున్నారు.అదేవిధంగా సెప్టెంబర్ 1న ఉదయం 8:30 గంటల నుంచి 10 గంటల వరకు వ్యవసాయ పరిశోధనా కేంద్రం, ముధోల్‌కు చెందిన ప్లాంట్ బ్రీడింగ్ శాస్త్రవేత్త, అధిపతి డా.ఆకుల దినేష్ విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.మూడు రోజుల పాటు జరిగే ఈ రాష్ట్ర స్థాయి మేళాను విద్యార్థులు,తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు సందర్శించి విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# విద్యార్థి నేస్తం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ జిల్లా కన్వీనర్‌గా రాథోడ్ రమేష్



**ప్రజాపక్షం / కెరమెరి:** విద్యార్థి నేస్తం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కన్వీనర్‌గా బోరిలాల్ గూడ గ్రామానికి చెందిన రాథోడ్ రమేష్, కో కన్వీనర్‌గా కెరమెరి కేంద్రానికి చెందిన పాత్లె రాజు నియమితులయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ బద్దం పురుషోత్తం రెడ్డి ఆదేశాల మేరకు వీరిని నియమిస్తూ ట్రస్ట్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పి. మురళీ మనోహర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతన బాధ్యులు మాట్లాడుతూ వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా యువత సాధికారతకు కృషి చేస్తామని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యా, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ వికాసంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. త్వరలో హైదరాబాద్‌లో జరిగే జాతీయ సమావేశాల్లో పాల్గొని భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. తమ నియామకానికి సహకరించిన ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ సి. గణేష్, డాక్టర్ పి. మురళీ మనోహర్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

# ఫారం పాండ్ నిర్మాణ పనులు ప్రారంభం

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్:** రాజంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని గొడవెల్లి మహాత్మా జ్యోతిబా పూలే బాలుర వసతి గృహం సమీపంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఫారం పాండ్ నిర్మాణ పనులను శనివారం సర్పంచి బుర్స పోచయ్య ప్రారంభించారు. రైతు మంతెన బాపు పొలంలో ఈ పనులను చేపట్టారు.ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ వర్షపు నీటిని ఒడిసిపట్టి భవిష్యత్ అవసరాలకు నిల్వ చేసుకునేందుకు ఫారం పాండ్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. దీనివల్ల రైతులకు సాగునీటి భద్రత పెరగడంతో పాటు భూగర్భ జలాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. అలాగే ఉపాధి హామీ ద్వారా స్థానిక కూలీలకు ఉపాధి లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు సభ్యుల జిల్లా కన్వీనర్ గులాం జావిద్, వార్డు సభ్యులు జబరి కిషోర్, తిరుసూల నానయ్య, పంచాయతీ కార్యదర్శి సాయి కుమార్, రమేష్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన ప్రజాసేవ సొసైటీ

**ప్రజాపక్షం / మందమర్రి:** విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటుగా ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కళ్యాణిఖని పాఠశాల విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజిత శ్రీలత సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజీమోద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రోత్సాహంగా పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సేవా కార్యక్రమాలకు దాతలు ముందుకు వచ్చి సహకరించాలని, ఆ సహాయాన్ని అర్హులైన విద్యార్థులకు సద్వినియోగం చేస్తామని కోరారు. కార్యక్రమంలో సొసైటీ జిల్లా అధ్యక్షుడు నందిపాటి రాజ్‌కుమార్, కార్యదర్శి గాండ్ల సంజీవ్ పటేల్, ఎండి జావిద్ పాషా, అన్వేష్, సూర్య, ఇమామ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# కార్పొరేట్లకు కేంద్రం ఊడిగం : ఎఐటియుసి




**ప్రజాపక్షం/వాంకిడి:** కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఎఐటియుసి జిల్లా డిప్యూటీ సెక్రటరీ ఆత్మకూరి చిరంజీవి ఆరోపించారు. వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఎఐటియుసి రాష్ట్ర మహాసభల గోడపత్రికలను ఆయన విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, 8 గంటల పని విధానం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సిర్పూర్ కాగిత పరిశ్రమలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, వాంకిడి ఆసుపత్రిని 100 పడకల స్థాయికి పెంచాలని కోరారు. సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు కరీంనగర్‌లో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు మహేష్, తిరుపతి, రాకేష్, ప్రశాంత్, చంద్రకళ, సిద్ధు పాల్గొన్నారు.

# దేవార వినోద్ స్వామికి గౌరవ డాక్టరేట్



**ప్రజాపక్షం / రెబ్బెన:** సామాజిక సేవకుడు దేవార వినోద్ స్వామికి యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్‌షిప్ అండ్ ఎక్సలెన్స్ సంస్థ "డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్" గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. పుదుచ్చేరిలోని కంబన్ కలైయరంగం ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన సదస్సులో తమిళనాడు మాజీ న్యాయమూర్తి డాక్టర్ కె. వెంకటేశన్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు.పేదలకు నిత్యావసరాలు, వేసవిలో అంబలి పంపిణీ, అనాథ యువతుల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం, సేవా కార్యక్రమాలను వినోద్ స్వామి చేపడుతున్నారు. ఆయనకు గౌరవ డాక్టరేట్ దక్కడంపై పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# మాజీ మంత్రి కొట్నాక భీంరావుకు నివాళులు

**ప్రజాపక్షం / వాంకిడి:** మాజీ మంత్రి కొట్నాక భీంరావు 24వ వర్ధంతిని బంబార గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ప్రజాసేవను లక్ష్యంగా భావించి పనిచేసిన కొట్నాక భీంరావు సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఆయన ఎనలేని కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన చూపిన ప్రజాసేవా మార్గంలో నడుస్తూ ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ ప్రజాప్రతినిధులు, సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్:** విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి, బిజెవైఎం ఆధ్వర్యంలో ఆసిఫాబాద్‌లో భారీ నిరసన దీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు ఎలగతి సుచిత్ ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు విడుదల చేయకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరిగెల నాగేశ్వరరావు, మాజీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీష్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోవ విజయ్, ఖాండ్రే విశాల్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అశోక్, మండల అధ్యక్షులు పెంటయ్య, సారా రమేష్ గౌడ్, సీనియర్ నాయకుడు సప్త శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రోడ్డు పనులు చేపట్టకుంటే నిరసన దీక్షలు

మాజీ ఎమ్మెల్యే
పద్మా దేవేందర్ రెడ్డి వెల్లడి



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** గత రెండున్నర ఏళ్లుగా కంకర రోడ్డులో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయని, రోడ్డు బాగా లేకపోవడంతో ఆ గ్రామాలకు బస్సు సౌకర్యానికి కూడా నోచుకోలేకపోతున్నయన్నారు. రోడ్డు పనులు చేపట్టకుంటే పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతామని, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి హెచ్చరించారు. శనివారం నిజాంపేట మండలం నందగోకుల్ నుండి చల్మెడ కమాన్ వరకు సుమారు 8 కిలోమీటర్ల వరకు కంకర రోడ్డు పై మాజీ ఎమ్మెల్సీ షేర్ సుభాష్ రెడ్డి, శశిధర్ రెడ్డితో కలిసి పాదయాత్ర చేపట్టారు. వారం రోజుల్లో ఈ రోడ్డు పనులు చేపట్టకపోతే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు నెరవేరని హామీలు ఎన్నో ఇచ్చి, నెగ్గినాక పూర్తిగా విస్మరిస్తున్నారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సాంక్షన్ చేసిన రోడ్లను సైతం పూర్తిచేసే దిక్కులేదన్నారు. నిజాంపేట, నస్కల్, నందగోకుల్, చల్మెడ కమాన్ వరకు 14 కిలోమీటర్ల రోడ్డు 13 కోట్లతో సాంక్షన్ చేయాగా, పనులు చేపట్టకపోవడంతో నస్కల్ గ్రామస్తులు నిజాంపేట లో నిరసన దీక్షలు 11 రోజులపాటు కొనసాగగా నిజాంపేట, నస్కల్ కమాన్, నందగోకుల్ వరకు సుమారు 7 కిలోమీటర్లు 10 కోట్ల పనులు ప్రారంభించకపోవడం సిగ్గు చేటు అన్నారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కు ఈ రోడ్డు పై ప్రజలు పడుతున్న ఇబ్బందులు పట్టడం లేదా ! అని ప్రశ్నించారు. ప్రజల ముందు కాంట్రాక్టర్ పనులు చేయడం లేదు అంటున్నారు కానీ, ప్రభుత్వం డబ్బులు ఇవ్వంది. కాంట్రాక్టర్ పనులు ఎక్కడ ? చేస్తారని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలు, అగ్గిలో కలిసాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటల వరకే పరిమితమయ్యారన్నారు. మళ్ళీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాకపోవడంతో పనులు అర్ధాంతంగా నిలిచిపోయాయన్నారు. వారంలో రోడ్డు పనులు ప్రారంభించకుంటే ప్రజలతో నిరసన దీక్షలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చౌదరి చరిత, లావణ్య రెడ్డి, మండల అధ్యక్షలు సుధాకార్ రెడ్డి, భాస్కర్ రావు, నంద్యాల బాల్ రెడ్డి, బజార్ రంజిత్ గౌడ్, కిష్టాగౌడ్, బిజ్జా సంపత్, ఎండీ అబ్దుల్, శ్రీకాంత్ గౌడ్, పప్పుల బాపురెడ్డి, పున్న వెంకటస్వామి, హనుమంత రెడ్డి, తిరుపతి రెడ్డి గ్రామాల ప్రజలు ఉన్నారు.

## రేగోడ్‌లో వైభవంగా రాఖీ పండగ

**ప్రజాపక్షం/రేగోడు :** మండల కేంద్రంలోని ఆయా గ్రామాల్లో శనివారం ఘనంగా రాఖీ పండగ జరుపుకున్నారు అనంతరం రాఖీ కడుతూ అన్నా చెల్లెలు అక్క తమ్ముడు శుభాకాంక్షలు తెలిపారు వైభవంగా జరుపుకున్నారు.

# అంగన్వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్:** చిన్నారుల సంక్షేమం, ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం కల్పించేందుకు సర్కిల్ పరిధిలోని మొత్తం 879 అంగన్వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు అందించినట్లు సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే తెలిపారు. తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సదుపాయం ద్వారా కేంద్రాల్లో ఫ్యాన్లు, లైట్లు, తాగునీటి మోటార్లు వినియోగించుకునే వెసులుబాటు కలిగిందన్నారు. దీనివల్ల వేడి, ఉక్కపోత ఇబ్బందులు లేకుండా చిన్నారులు సౌకర్యవంతంగా విద్య, ఆటపాటలు, అభ్యసన కార్యక్రమాల్లో పాల్గొనవచ్చని తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు విధులు సమర్థవంతంగా నిర్వహించడానికి, పోషకాహార తయారీ, తాగునీటి సరఫరా, పరిశుభ్రత పనులకు ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రాన్ని విద్యుత్ వెలుగులతో నింపడాన్ని సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని ఎస్ఈ వివరించారు.

# సెప్టెంబర్ 4 నుంచి సింగరేణి వార్షిక క్రీడా పోటీలు

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్:** సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే 2026–27 వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా శ్రీరాంపూర్ ఏరియా అంతర్ విభాగ క్రీడా పోటీలు సెప్టెంబర్ 4 నుంచి ప్రారంభం కానున్నాయని అధికారులు తెలిపారు. స్థానిక ప్రగతి స్టేడియంలో జరిగే ప్రారంభోత్సవానికి ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభిస్తారు. సెప్టెంబర్ 4న వాలీబాల్‌తో మొదలయ్యే పోటీలు 27వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్, చెస్, క్యారమ్స్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, క్రికెట్, అథ్లెటిక్స్, స్విమ్మింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి పలు పోటీలను ప్రగతి స్టేడియం, శాంతి స్టేడియం, ఎస్సిఒఎ క్లబ్, సేవా భవన్ తదితర వేదికల్లో నిర్వహిస్తారు. ఏరియాలోని గనులు, విభాగాలను నాలుగు జట్లుగా విభజించారు. క్రీడా నైపుణ్యం కలిగిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని జీఎం మునిగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

# రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు పేదలకే దక్కాలి: ఉప్పుల కృష్ణ



**ప్రజాపక్షం / వాంకిడి:** రాజకీయాలు, వ్యక్తిగత పరిచయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మండల కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు ఉప్పుల కృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై ఆయన మాట్లాడారు. కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కుటుంబ ఆర్థిక పరిస్థితి, నివాస స్థితిగతులను పరిశీలించి జాబితాలు రూపొందించాలని కోరారు. గ్రామసభలు నిర్వహించి ఎంపికైన వారి వివరాలను ప్రజల ముందు ఉంచాలన్నారు. కొన్ని పంచాయతీల్లో బిఆర్ఎస్ సర్పంచులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని సూచించారు. సొంత ఇళ్లు లేని నిరుపేదలు, గుడిసెలు, రేకుల ఇళ్లలో నివసించే వారికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా ఎంపిక పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

# శాత్రాజ్ పల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించాలి

అధికారులు,ప్రజాప్రతినిధులను
కోరుతున్న గిరిజనులు



**ప్రజాపక్షం/ముత్తారం :** మారుమూల అటవీ ప్రాంత గ్రామమైన గిరిజన పల్లెలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు అధికారులు,ప్రజా ప్రతినిధులు స్పందించి,తమ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించాలని నిరుపేద గిరిజనులు కోరుతున్నారు.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శాత్రాజ్ పల్లి గ్రామంలో సుమారు 45 కుటుంబాలు జీవిస్తున్నాయి.వీరిలో నాలుగు ఎస్సీ కుటుంబాలు కూడా ఉన్నాయి.ప్రతి ఏటా వర్షాకాలం వచ్చిందంటే చాలు,సమీపంలోని మానేరు వాగు ఉధృతంగా పొంగి ప్రవహిస్తుంది.దీంతో వాగు దాటలేని పరిస్థితి ఏర్పడి,ఈ పల్లె బాహ్య ప్రపంచంతో పూర్తిగా తెగిపోతుంది. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందక ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ప్రస్తుత వర్షాకాల నేపథ్యంలో గ్రామంలో దోమల వ్యాప్తి,కలుషిత నీటి వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వ్యాధులు ముదరక ముందే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని వారు వేడుకుంటున్నారు. తక్షణమే శాత్రాజ్ పల్లిలోనే ఒక ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి,గిరిజనులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి,ఉచితంగా మందులు పంపిణీ చేయాలని,అలాగే ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని నిరుపేద గిరిజనులు కోరుతున్నారు.

# రోస్టర్ విధానాన్ని సవరించాలి: దాసరి రామన్న

**ప్రజాపక్షం / మందమర్రి:** రోస్టర్ విధానాన్ని వెంటనే సవరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 31న నిర్వహించనున్న సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల సంఘం పట్టణ అధ్యక్షుడు దాసరి రామన్న పిలుపునిచ్చారు. సంబంధించిన గోడపత్రికలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ జీవో 99 మాలల భవిష్యత్తును దెబ్బతీసే విధంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాల కల్పన కోసం ప్రభుత్వం రోస్టర్ విధానాన్ని పునఃపరిశీలించి తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇంటికో మాల.. చలో సెక్రటేరియట్ నినాదంతో మాల సంఘాల నాయకులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరసనను ప్రభుత్వానికి బలంగా తెలియజేయాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



**ప్రజాపక్షం/ముత్తార్గం :** జాతీయ క్రీడ్గా దినోత్సవం సందర్భంగా హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జన్మదిన వేడుకలు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పోతారం జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో శనివారం ఘనంగా జరిగాయి.పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు చేగొండ రాజ్ కుమార్ మాట్లాడుతూ ధ్యాన్ చంద్ ఒలింపిక్స్‌లో వరుసగా మూడు సార్లు హాకీలో బంగారు పతకాలు సాధించి, దేశ ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లారని కొనియాడారు. విద్యార్థులందరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారుపాఠశాల ఉపాధ్యాయులు కె. శ్రీనివాస్,చంద్రశేఖర్,రాధ ,రషీద్,నాగేందర్,సుజాత తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రై ఫ్రూట్స్‌తో రాఖీలు తయారు చేసిన చిన్నారి



**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన 7వ తరగతి(ఎంజేపీ ప్రభుత్వ హాస్టల్) విద్యార్థిని రాజిపేట ఆరాద్య డ్రై ఫ్రూట్స్ ఉపయోగించి రాఖీలు సొంత ఆలోచనతో తయారు చేసింది. రాఖీ పౌర్ణమి సందర్భంగా అన్న ఆదిత్యకు కట్టింది. పప్పులు, ఆకులతో కూడా రాఖీ తయారు చేసింది. వీటిని వృధాగా పారేయకుండా మళ్లీ తినే విధంగా ఉపయోగపడుతాయని చిన్నారి ఆలోచన. ప్లాస్టిక్, రసాయన వర్ణతో తయారు చేసినవి ఒనుగోలు చేసి ట్టడంతో అవి వృధా అవుతున్నాయని తెలిపారు. వాటిఇ వినియోగించే డబ్బు డ్రై ఫ్రూట్స్ వినియోగించి తిరిగి తినేందుఉ దోహదపడుతుందని చిన్నారి ఆలోచన. గత ఏడాది కూడా ఎలాంటి రసాయనాలు, ప్లాస్టిక్ వస్తువులు ఉపయోగించకుండా కాగితాలు ఉపయోగించి రాఖీలు తయారు చేసి కట్టింది.

## అంజన్నదేవాలయంలో భక్తుల తాకిడి



**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల గ్రామ పంచాయతీ శివారులోని అటవి ప్రాంతంలో పవిత్ర పుణ్యక్షేత్రమైన చాకరిమెట్ల శ్రీసహకార ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తుల తాకిడి పెరిగింది. ఆలయ ఫౌండర్ ఛైర్మన్ భాస్కర రాయిని ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో చందనాభిషేకం, సత్యనారాయణస్వామి వ్రత పూజలు కన్నులపండువగా జరిగాయి. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## అన్నా చెల్లెళ్ల అనుబంధమే రాఖీ పండగ

**ప్రజాపక్షం/అల్లాదుర్గం :** అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ప్రేమకు, ఆప్యాయతకు ప్రతీక రాఖీ పండగ మండల ప్రజలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. చెల్లెలు అన్నకు రాఖీ కట్టి, అతని క్షేమాన్ని కోరుకుంటుంది. అన్న తన చెల్లెలికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇస్తాడు. అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ప్రేమ, ఆప్యాయత, అనురాగాలకు ప్రతీక. ఈ పవిత్రమైన రోజున చెల్లెలు తన అన్న తమ్ముళ్ల చేతికి రాఖీ కట్టి, స్వీట్లు పంచుకుని మంగళ హారతులు ఇచ్చిఅతని ఆయురారోగ్యాలను కోరుకుంటుంది. అన్న తన చెల్లెలికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తానని మాట ఇస్తాడు. రాఖీ కేవలం ఒక దారం కాదు అది అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ఆత్మీయ బంధానికి గుర్తు. అందుకే రాఖీ పండుగ ప్రతి ఇంటిలో ప్రేమానురాగాలను పంచే ప్రత్యేకమైన పండుగగా జరుపుకున్నారు.